C KSR02B184

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
సెప్టెంబరు 10, 2017

స్నేహ

కథా నిలయం
ENTERED
శ్రీకాకుళం
E

శ్వాసిస్తేనే సాధించగలం





యాక్టింగ్‌లో స్టార్‌డమ్‌ని సంపాదించుకున్న బాలీవుడ్ తారల్లో కొందరు దర్శకులుగా, ప్రొడ్యూసర్లుగా రాణిస్తుంటే మరి కొందరు సింగర్స్‌గా తమ సత్తా చాటుకుంటున్నారు. మరికొందరు నటులైతే ఇప్పటికే సొంత ప్రొడక్షన్ హౌస్‌ని మొదలు పెట్టారు. అలా తమ సొంత ప్రొడక్షన్స్‌లో స్టార్‌డమ్‌నే కాదు మంచి దర్శకులుగా, నిర్మాతలుగా పేరుతెచ్చుకున్న ఆ బాలీవుడ్ తారలెవరో మీరూ తెలుసుకోండి.

బాలీవుడ్ చిత్రసీమలో మల్టీట్యాలెంటెడ్‌గా గుర్తింపుతెచ్చుకున్న నటుడు అమీర్ ఖాన్. డైరెక్షన్ అనుభవంతోపాటు కొన్ని సినిమాలకి కో ప్రొడ్యూసర్‌గా, ప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరించాడు అమీర్. 1999లో ఎకెపి ప్రొడక్షన్ హౌస్‌ని మొదలు పెట్టాడు. అలా సొంత ప్రొడక్షన్స్‌లో విడుదలైన 'లగాన్', 'తారే జమీన్ పర్', 'దంగాల్' చిత్రాలు ఫిల్మ్‌ఫేర్ అవార్డులనీ అందుకున్నాయి. యాక్టింగ్ కెరీర్‌తోపాటు నిర్మాతగా గొప్ప పేరుతెచ్చుకున్నాడు అక్షయ్ కుమార్. ప్రస్తుతం తన భార్య ట్వింకిల్‌తో కలిసి ఓ ప్రొడక్షన్ సంస్థని నిర్వహిస్తున్నాడు. 'సింగ్ ఈజ్ కింగ్, 'యాక్షన్ రీ ప్లే', 'పాటియాలా హౌస్', 'కిలాడి-786', 'ఎయిర్ లిఫ్ట్', 'రుస్తుమ్' లాంటి చిత్రాలన్నీ సొంత బ్యానర్‌పై వచ్చినవే. రెడ్‌చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్స్ పొడక్షన్ హౌస్ ద్వారా నిర్మాతగా కూడా సక్సెస్ అయ్యాడు షారుక్. 'బిల్లు బార్బర్', 'ఓమ్ శాంతి ఓమ్', 'చెన్నయ్ ఎక్స్ ప్రెస్' చిత్రాలకి నిర్మాతగా వ్యవహరించింది షారుకె. ఇక హీరోయిన్ల విషయానికొస్తే బాలీవుడ్‌లో పరిచయం అవసరం లేని నటి నందితాదాస్. యాక్టర్ కమ్ డైరెక్టర్‌గా ఇప్పటికే పేరు తెచ్చుకున్నారు ఆమె. ఇప్పుడు అనుష్క శర్మ కూడా ఇదే బాటలో నడుస్తోంది. 'ఎన్‌హెచ్ -10' చిత్రానికి ప్రొడ్యూసర్‌గా వ్యవహరించింది అనుష్క. మోడల్‌గా నటిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న నటి పూజా భట్. ప్రస్తుతం తన తండ్రి మహేష్ భట్ అడుగుజాడల్లో ప్రయాణిస్తూ నిర్మాతగా, ప్రొడ్యూసర్‌గానే కాదు ప్రొడక్షన్ డిజైనర్‌గానూ రాణిస్తోంది.

బహుముఖ తారలు

KSR02B184
ENTERED

విజేత



ఢిల్లీ చిరుత

11 సెకన్లలో 100 మీటర్ల పరుగు. అదీ పదిహేనేళ్లలోపే వయస్సు. జాతీయ రికార్డు బద్దలైంది. స్వర్ణ పతకం మెళ్లో పడింది. నిస్సార్ అహ్మద్ పేరు గ్యాలరీలో హోరెత్తింది. ఈ పరుగుల విజేత ఇంటికి తిరిగెళ్లాడు. తండ్రి అప్పుడే రిక్షా తొక్కి ఇంటికొచ్చాడు. అమ్మ పాచిపనులు చేసుకొచ్చి ఓ మూల కూలబడింది. పతకంతో కొడుకొస్తే పండుగ వచ్చినట్టే. ఆ సంతోషం తండ్రి కాలి పిక్కలకు మరింత సత్తువనిస్తుంది. తల్లి చేతుల గాయాలకు మందు రాస్తుంది. అందుకే నిస్సార్ పరుగు ఆపడు. ఇంటికి పతకం లేకుండా వెళ్లడు. ఆ పేదింటి విజేత కథ ఇదే.

నిస్సార్ కథతో ఓ బాలీవుడ్ బయోపిక్ తెరకెక్కించొచ్చు. లేదా స్ఫూర్తి కథలా పదిమందికి విని పించొచ్చు. ఢిల్లీ చిరుతగా పేరు తెచ్చేసుకున్నాడు. అయినా ఇంకా అమ్మానాన్నలు అతడి పరుగును గ్యాలరీలో చూసుకునే అవకాశం లేదు. తండ్రి రిక్షా తొక్కాల్సిందే. అమ్మ ఇళ్లల్లో పనులకు వెళ్లాల్సిందే. 100 మీ., 200 మీ.ల పరుగులో జాతీయ స్టార్‌గా నిలిచిన నిస్సార్‌కు ఎంతో భవిష్యత్తు ఉంది. కానీ అతడి భవితను పరుగు పందెంలో దేశ భవిష్యత్తును ప్రశ్నార్థకంలో పడేస్తోంది పేదరికం. దీన్ని వేగంగా దాటేస్తేనే కానీ నిస్సార్ పరుగు తేలికవదు. పురుషుల కేటగిరీలో 100 మీ.ల పరుగులో రికార్డు 11 సెకన్లకు 0.002కు తక్కువ. ఈ మాత్రం తేడాతోనే నిస్సార్ కాస్త వెనుకబడ్డాడు. కానీ నిస్సార్ ఇంకా బాలుడే.. యువకుడిగా సత్తువ పెరిగితే ఈ జాతీయ రికార్డు చెదిరిపోవడమే కాదు ప్రపంచ రికార్డులతో దేశానికి పతకాలు తేవడం ఖాయంగా కనిపిస్తోంది. అండర్-16 శ్రేణిలో ఇప్పటికే అతడు 100 మీ., 200 మీ.ల జాతీయ రికార్డులను బద్దలుకొట్టాడు. ఈ దెబ్బకు 2013లో ఎంఎస్ అరుణ్, చందన్ బౌరీ నెలకొల్పిన ఫీట్లు కనుమరుగయ్యాయి. గతేడాదే జాతీయ చాంపియన్‌షిప్‌లో పాల్గొని తొలిసారే 100 మీ.ల పరుగులో స్వర్ణం, 400 మీ.ల పరుగులో కాంస్యం సాధించి కోచ్‌ల దృష్టిలో పడ్డాడు. 600 మీ.ల పరుగులోనూ నిస్సార్ సంచలనాలు నమోదు చేస్తున్నాడు. 2020, 2024 ఒలింపిక్స్‌కు ప్రత్యేకంగా తయారుచేస్తున్న యువ క్రీడాకారుడితడు. ఇన్ని మెరుపుల మాటున నిస్సార్ ఇప్పటికీ బాధపడేది తన కుటుంబ స్థితిగతుల గురించే. తన ఒక్క గెలుపును కూడా తల్లిదండ్రుల్లో ఒక్కరు కూడా నేరుగా చూడలేకపోవడానికి మించిన లేమి ఏముంటుంది మరి. ఈ రైజింగ్ స్టార్‌ను కన్న మహమ్మద్ హక్, షఫీకునీషా తమ రోజు ఆదాయాన్ని వదిలి కొడుకుతో స్టేడియానికి వెళ్లే ఆలోచన చేయనివ్వని పరిస్థితి పేదరికానిది. తాను పెడల్ తొక్కడం ఆపితే కొడుకు పరుగు ఆగుతుందనే భయం తండ్రిది. నిస్సార్ శిక్షణ తీసుకోడానికి ఆయన తెగించి 28 వేల రూపాయలు అప్పు చేశాడు. వాటితో కొడుక్కి స్పైక్స్, మిగతా స్పోర్ట్స్ గేర్ కొన్నాడు. మరి ఎంతకాలమని పాడైపోయిన షూలతో పరుగెడుతూ నిస్సార్... గాయాలపాలవ్వాలి. తండ్రి.. కొడుకు పాదాల గురించి ఆలోచిస్తే.. తల్లి.. బిడ్డ కడుపాకలి గురించి ఆలోచిస్తుంది. అందుకే ఆమె ఇంటి పనికెళుతోంది. టీవీలో కూడా కొడుకు పాల్గొన్న పోటీలు కనిపించవు. మొబైల్‌లో ఎవరో మిత్రుడు చిత్రీకరిస్తే.. దాన్ని తీసుకెళ్లి తల్లిదండ్రులకు చూపించి సంతోషిస్తాడు నిస్సార్. అతడికి ఓ సోదరి కూడా ఉంది. వీళ్లంతా కలిసి 10 అడుగుల వెడల్పుండే ఓ రూమ్‌లోనే సర్దుకుంటున్నారు. ఢిల్లీలోని ఆజాద్‌పూర్ రైల్వే ట్రాక్‌ల పక్కనుండే మురికివాడలో అది ఉంటుంది. అక్కడి ప్రభుత్వ బడిలోనే చదువుకుంటున్న నిస్సార్ ప్రతిభను గుర్తించింది ఆ పాఠశాల పీఈటీనే. ఆయన చొరవ వల్లే నిస్సార్ జోన్ స్థాయి పరుగు పందేల్లో పాల్గొని విజేతగా నిలిచాడు. తన పేదరికం, వెనుకబాటుతనపు ఆలోచనల్ని పరుగు పక్కకు నెట్టేసేదట నిస్సార్‌కు. అందుకే పీఈటీ శిక్షణ అనగానే అందరికన్నా ముందుగా మైదానంలోకి వచ్చేసేవాడు. అందరూ పరుగు ఆపినా కూడా మరో రౌండ్ వేసేవాడు. నిస్సార్‌కు ఓ లక్ష్యం ఉంది ఒలింపిక్స్‌లో పతకం గెలవడం కాదు, సెలెబ్రిటీ క్రీడాకారుడిగా దేశంలో పేరు తెచ్చుకోవడం కాదు, తన తల్లి వేరేవారి ఇళ్లకు వెళ్లి పాచిపని చేయాల్సిన అవసరం రాకుండా చూసుకోవాలని. నిస్సార్ ఇంటికి చేరేసరికి ఎందరో మిత్రులు ఎదురుపడుతుంటారు. అతడు చెప్పే రెండు మాటల కోసం గోల చేస్తుంటారు. 'దో నేషనల్ రికార్డు తోడ్ దియా' (రెండు జాతీయ రికార్డులను బద్దలు కొట్టా) అనే ఆ మాటలు వారిలో ఉత్తేజం నింపుతాయి. బడా భాగ్ స్లమ్ గురించి గొప్పగా వార్తలు నిస్సార్ వల్ల వస్తున్నాయన్న సంతోషం బస్తీలోని పెద్ద వాళ్లది. అందుకే నిస్సార్‌ది అందరి విజయం. అందుకే నిస్సార్ పరుగుకు అంత వేగం. ఇంట్లోని టీవీ సెట్ పక్కన చక్కగా సర్ది ఉండే ట్రోఫీల్లో నిస్సార్ బాగా ఇష్టపడేది... పాఠశాల స్థాయిలో ఉత్తమ క్రీడాకారునిగా వచ్చినదే. ఆ ఇంట్లో నిషార్ ట్రోఫీలే ధర ప్రకారం కూడా మిగతా వాటికన్నా విలువైనవి. ఆ మిగతాలో... లిస్టు రాసుకోవాల్సిన వస్తువులేవీ ఉండవులెండి. ఈసారి ట్రోఫీ ఇంటికి తెస్తే దాని ధర ప్రకారం కాక ప్రతిభ ప్రకారం విలువ పెరగాలని కోరుకుందాం. ★

ఇండెక్స్

శ్వాసిస్తేనే సాధించగలం

సేవా 3
ఊరి కోసం... చెరువు తవ్వాడు

స్టార్ 4
యానిమేషన్ చిత్రాంజలి

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10
వెనుక ముఖం

తెలుసా............... 11
మన రెడ్ పాండా

కవిత్వమ్...............14
పచ్చని ప్రశ్న

అట్టమీది కథ...6

అనుబంధాల సింధువు ఆపాత చిత్రం- 12

కథ 15
తొలి అడుగు

కొత్త పుస్తకాలు 18
సమాజాన్ని ప్రశ్నించిన కవితలు

వివరం 20
ప్రకృతి బడి

రుచి.........................21
ఓట్స్ మినీ బర్గర్

బాల నేస్తాలు.............23
కుందేలు బొమ్మ చేసేద్దాం!

పద వికాసం........24

ఆకట్టుకున్న ఈ చిత్రం

ఈ వారం స్నేహ ఆదివారం అనుబంధం రంగుల్లో చాలా ఆకర్షణీయంగా వుంది. ముఖ్యంగా చిత్రం భళారే విచిత్రం తెలుగు సినిమా రంగం గురించిన విషయాలు మూకీ యుగం నుంచి టాకీ యుగం వరకూ గల విషయాలు చాలా చక్కగా వివరించారు.

- ఎల్. ప్రపుల్ల చంద్ర, ధర్మవరం.

తారుమారు జీవితం

ఆదివారం అనుబంధం సంచికలో 'తారుమారు జీవితం' శీర్షికన వచ్చిన రచన నన్ను అమితంగా ఆకట్టుకుంది. అన్నపూర్ణ బ్యానర్‌లో వచ్చిన చిత్రరాజములు అన్ని అనర్ఘరత్నాలే. గతంలో ఆ సంస్థ తీసిన చిత్రాలు ఎక్కువ ప్రజాదరణ పొందాయి. 'ఇద్దరు మిత్రులు' చిత్రం నాగేశ్వరరావు ద్విపాత్రాభినయం చేసిన మొదటి చిత్రం వివరాలు ఆశ్చర్యపరిచాయి. ఈ చిత్రంలోనూ రెండు విరుద్ధమైన పాత్రలు, నటుల నటన పరాకాష్టకు చేరింది. చిత్రంలో ప్రతి పాత్ర హైలెట్. నటులందరూ పాత్రలో లీనమై నటించారు. ఛాయాగ్రాహకుడు సాంకేతిక పరంగా అత్యుత్తమంగా చిత్రాన్ని నిర్మించాడు. ఈ ఘనత మధుసూదన రావుగారికి



చెందుతుంది. ఇలాంటి ఆపాత చిత్రాల ఘనతను వెలుగులోకి తెస్తున్నందుకు అభినందనలు.

కై.ప నాగరాజు, అనంతపురం.

అంతెత్తు మనిషి

మరుగుజ్జు వారిని చులకనగా చూస్తుంటారు చాలామంది. అలాంటి వారికి మ్యాథ్యూ జీవితం కనువిప్పు. వివిధ క్రీడల్లో పథకాలు గెలుచుకోవడంతోపాటు కెనడాలో జరిగిన మరుగుజ్జు ఛాంపియన్‌షిప్‌లో భారత్ నుండి జొబి మ్యాథ్యూ ఎంపికవ్వడం అభినందనీయం. గార్డెనింగ్‌లో కొత్త ఒరవడి సృష్టిస్తున్న గెరిల్లా గార్డెనింగ్ ఆలోచన ఆకట్టుకుంది. గుంతలు, పల్లపు ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణాన్ని తొలగించేందుకు ఇలాంటి ఆలోచనలు మంచి ఫలితాలనిస్తాయి. చివరి అట్ట చిత్రాలు ' అలవాటు మారుతోంది', 'సామాన్యులతో యువరాణి', 'బొగ్గు బొమ్మలు' అబ్బురపరిచాయి. ఆపాత చిత్రం, కవితలు బాగున్నాయి.

-ఎన్. అఖిల, విజయవాడ.

అలవాటు మారుతోంది

పొగ తాగటం ఆరోగ్యానికి హానికరం అని తెలిసినా ఆ అలవాటు నుండి చాలామంది బయటపడలేకపోతున్నారు. చివరి అట్టపై ఇచ్చిన చిత్రాలు అలాంటి వాళ్లలో మార్పు కలిగించే విధంగా వున్నాయి. 'కోరికోరి కొబ్బరి' అట్టమీది కథ ద్వారా కొత్త విషయాలు తెలుసుకున్నాం. 'సమాంతరంగా కొంకనా', 'సౌర స్నేహితుడు', 'సెల్ఫీ క్లాస్', 'గద్దల గ్యాంగ్', 'చదువుల పోటీ కథ, 'బొగ్గుబొమ్మలు' బాగున్నాయి. నవ్వుల్ పువ్వుల్ నవ్వుతెప్పించాయి.

పి. సతీష్, తెనాలి.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

భార్య కోసం బావిని తవ్విన బాపూరావ్ టాజ్నె, కొండల్ని పెకిలించి దారి చేసిన దశరథ్ మాంజీ గురించి మీరు చదివే ఉంటారు. ఆ కోవకి చెందిన వ్యక్తి శ్యామ్ లాల్. గ్రామంలో నీటి సమస్యని తీర్చడంలో 27ఏళ్ళు శ్రమించాడు. ప్రభుత్వం నుండి ఎలాంటి సాయం అందకపోయినా శ్యామ్‌లాల్ చేసిన ఆ కృషే ఆ గ్రామంలో నీటి కరువుని తీర్చింది. ఆ వివరాలేంటో చూద్దామా...!

ఊరి కోసం... చెరువు తవ్వాడు

మన దేశంలో ఇప్పటికీ ఎన్నో గ్రామాలు తీవ్ర నీటి కరువుని ఎదుర్కొంటూనే వున్నాయి. చత్తీస్‌ఘడ్‌లోని సజ పహాడ్ గ్రామస్తులు అలాంటి పరిణామాలనే ఎదుర్కొనేవారు. గుక్కెడు నీళ్ళ కోసం ఊరి పొలిమేర్లలో వున్న రెండు చిన్న బావులపై ఆధారపడాల్సి వచ్చేది. ఇక వేసవిలో ఆ నీరు కూడా కరువవ్వడంతో వ్యవసాయం, పశుపోషణతోపాటు తాగునీటి సమస్యలతో గ్రామస్తులు అలమటించేవారు. ఏళ్ళ తరబడి ఈ సమస్యని ఎదుర్కొంటున్నా గ్రామీణ అధికారులెవరూ వాళ్ల సమస్యలని పట్టించుకోలేదు. ఇలాంటివన్నీ పదిహేనేళ్ళ శ్యామ్ లాల్‌ని కలచివేశాయి. అందరిలా తను ఆ సమస్యని తేలికగ్గా వదిలేయలేదు. ఓ చక్కని పరిష్కారాన్ని కనిపెట్టాడు. దగ్గరలో వున్న అడవిలో చెరువుని తవ్వడం ద్వారా గ్రామంలో నీటి సమస్యని తగ్గించుకోవచ్చనేది తన ఆలోచన. ఆ ఆలోచననే గ్రామస్తులతో పంచుకున్నాడు శ్యామ్ లాల్. అదో అమాయక ఆలోచనంటూ వారు పెదవి విరిచారు. కనీసం కొందరైనా తనని అర్థం చేసుకుంటారనుకున్నాడు శ్యామ్‌లాల్. అయితే అలాంటిదేమి జరగలేదు. వెర్రివాడంటూ అతని మాటల్ని కొట్టి పడేశారంతా. ఇక తనే సొంతగా చెరువు తవ్వాలని నిర్ణయించుకున్నాడు శ్యామ్ లాల్. ఒక చిన్న పార తీసుకుని అడవిలో చెరువు తవ్వడం మొదలు పెట్టాడు. లక్ష్యాన్ని పూర్తిచేయడానికి శ్యామ్ లాల్‌కి కొన్నేళ్ళు పట్టింది. బాధకరమైన విషయం ఏంటంటే చెరువును తవ్వేందుకు ఇన్నేళ్ళలో ఒక్కరు కూడా తనకి సాయపడకపోవడం. అయితే శ్యామ్‌లాల్ మాత్రం ఒక్క రోజుకూడా తన పని ఆపలేదు. గ్రామస్తులతోపాటు అక్కడుండే పశువులకి ఎలాంటి

నీటి కొరత ఉండకూడదనేది తన లక్ష్యం. అందుకోసం చెరువు తవ్వడంలో నిమగ్నమయ్యాడు. తవ్వకాల్లో వచ్చే మట్టిని తొలగించడం, చెరువు గట్టుని ఏర్పాటు చేయడం, మురికి నీటిని వేరుచేయడం... ఇలాంటి పనులన్నీ ఒక్కడే చేసేవాడు. అలా చెరువు తవ్వకం పని పూర్తి చేయడానికి దాదాపు 27 ఏళ్ళు పట్టింది. ఎకరం భమిలో పదిహేను అడుగుల లోతున ఓ మంచినీటి చెరువుని నిర్మించాడతను. ప్రస్తుతం గ్రామంలో ఎంతో మంది నీటి అవసరాలని తీర్చడంలో ఆ చెరువే కీలకమయ్యింది. అదే తనకి నిజమైన ఆనందాన్నిచ్చిందంటారు శ్యామ్‌లాల్. ప్రస్తుతం తన వయసు 42 సంవత్సరాలు. ఊరికోసం ఇంతలా కష్టపడ్డ శ్యామ్ లాల్ నిజానికి ధనవంతుడేం కాదు. తనది ఓ నిరుపేద కుటుంబం. అయితే గ్రామానికి తనవంతు సాయపడాలనుకున్నాడంతే... రోజు మొత్తంలో కొంత సమయాన్ని చెరువు తవ్వడానికి కేటాయించగలిగానంటాడు శ్యామ్‌లాల్.

సామాజిక మాధ్యమాల ద్వారా శ్యామ్‌లాల్ కృషి అన్ని ప్రాంతాలకి పాకేసింది. చుట్టుపక్కల గ్రామాల నుండి ఎంతో మంది ఈ గ్రామాన్ని సందర్శించేందుకు వచ్చారు. దాదాపు 27ఏళ్ల పాటు ఒంటరిగా ఊరికోసం శ్రమించిన శ్యామ్‌లాల్‌ని అభినందిస్తున్నారు. స్థానిక శాసన సభ్యుడు, ఐఏఎస్ అధికారి ఈ గ్రామానికి వెళ్ళి శ్యామ్‌లాల్‌ని ప్రశంసించడంతోపాటు తనకు పదివేల రూపాయలని అందజేశారు. ఆ డబ్బుని కూడా గ్రామ అభివృద్ధికే వినియోగించాడు శ్యామ్‌లాల్.

- శర్వాణి



యానిమేషన్ చిత్రాంజలి

స్టార్

యానిమేషన్ చిత్రాలనగానే మనకు హాలీవుడ్ గుర్తొచ్చేస్తుంది. అంతర్జాతీయ అవార్డుల్ని అందుకున్న భారతీయ యానిమేషన్ చిత్ర దర్శకురాలు మనకు ఒకరున్నారనే విషయం ఎంతమందికి తెలుసు. ఆమె పేరు గీతాంజలి రావ్. చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సృష్టించుకున్న ఆమెవన్నీ ఇండిపెండెంట్ చిత్రాలే. 2006లో 'ప్రింటెడ్ రెయిన్‌బో' చిత్రంతో కేన్స్ చిత్రోత్సవంలో మూడు పురస్కారాల్ని అందుకుని తన ముద్ర వేసింది. యానిమేషన్ చిత్రాల గురించి పెద్దగా అవగాహన లేని మన దేశం నుంచి వచ్చినా ఆమె ఎన్నో 'బెస్ట్ షార్ట్స్'ను తీసి అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించారు.



ముంబైలోని జేజే కళా కేంద్రంలో 'ఇల్లస్ట్రేషన్' ప్రధాన పాత్యాంశంగా డిగ్రీ చేసిన గీతాంజలి రావ్ రంగస్థల కళాకారిణి.

● 2006లో ఆమె తీసిన 'ప్రింటెడ్ రెయిన్‌బో' చిత్రాన్ని వందకు పైగా చిత్రోత్సవాల్లో ప్రదర్శించారు. 'ఆస్కార్ అవార్డు'కు షార్ట్‌లిస్ట్ అయ్యింది. 25 అంతర్జాతీయ పురస్కారాలు దక్కాయి.

● పెంపుడు పిల్లి తప్ప ఇంకేమీ లేని ఓ వృద్ధురాలు అగ్గిపెట్టెల మీదుండే చిత్రాల లోకంలో మునిగి ఒంటరితనాన్ని ఎలా పోగొట్టుకుందనేది 'ప్రింటెడ్ రెయిన్‌బో' కథాంశం. 15 నిమిషాల నిడివితో రూపొందిందీ ఈ లఘుచిత్రం.

● పాత విధానంలోలా కేన్వాస్ మీద చిత్రీకరించిన చిత్రాల ద్వారా యానిమేషన్ చేస్తుంది గీతాంజలి. ఆమెతో కలసి 30 మంది చిత్రకారులు పనిచేస్తారు.

● ఒక్క మాట కూడా లేకుండా కేవలం నిమిషం నిడివితో ఆమె తీసిన 'బ్లూ' చిత్రం.. అంతరిక్షంపై ఓ చిన్నారికుండే కలల్ని చూపెడుతుంది. రంగు పెన్సిళ్లు, కాగితాల మీద చిత్రీకరించిన షార్ట్ ఇది.

● ఇదే కాదు, ఒక్క మాట లేకుండా 80 నిమిషాల నిడివితో ఆమె 'గిర్గిత్' ప్రాజెక్ట్‌ను చేపట్టింది. జానపద కళల్లోని వైవిధ్యాన్ని, విలక్షణతల్ని దీనిలో హైలెట్ చేస్తూ చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది.

● పెద్దలకు యానిమేషన్ చిత్రాలు ఉంటాయనే విషయం చాలామందికి తెలీదు. గీతాంజలి చిత్రాలు ఈ తరహావే. 'ఆరెంజ్', 'బ్లూ', 'గిర్గిత్', 'కైలడొస్కోప్', 'ట్రూ లవ్‌స్టోరీ'లు ఈ కోవకి చెందినవి.

● ఒక్కో పూర్తి స్థాయి యానిమేషన్ చిత్రానికి నాలుగేళ్ల వరకు పడుతుంది. బడ్జెట్ ఎక్కువే. ఈ అడ్డంకే ఆమెకు పెద్ద చిత్రాలను తీసే అవకాశం ఇవ్వడంలేదు.

● ఓ కఠిన వాస్తవాన్ని కవితాత్మకంగా చెప్పేందుకు ఫొటోగ్రఫీ, యానిమేషన్ అవకాశమిస్తాయనే గీతాంజలి చిత్రాల నిండా సామాన్యుడి సమస్యలే మెదులుతాయి.

● తను సొంతంగా సినిమాలు నిర్మించుకునే ఆర్థిక వెసులుబాటు కోసం యానిమేషన్ యాడ్స్‌ను రూపొందిస్తున్నారు. వీటికీ పురస్కారాలు వచ్చాయి.

● ముంబైకొచ్చే వలస కూలీల జీవితాలపై ఆమె తీసిన 'బాంబే రోజ్' చిత్రం ఉత్తమ చిత్రంగా అవార్డులను అందుకుంది. ఓ కాశ్మీరీ యువకుడు, మధ్యప్రదేశ్ అమ్మాయి మధ్య ప్రేమ కథ ఇది.

● బాలీవుడ్‌లో ఓ నిరుపేద ఆకాంక్షలు నెరవేరడం ఎందుకు కష్టమో.. ఆ చిత్రసీమ ఎంత

ప్రమాదకరమైందో అనే విషయాన్ని కథావస్తువుగా తీసుకుని ఆమె పూర్తిస్థాయి చిత్రాన్ని రూపొందించే సాహసం చేసింది. కానీ ఆర్థిక కారణాలతో దాన్ని షార్ట్‌ఫిల్మ్‌గా మార్చింది. దీనికి కూడా కేన్స్ చిత్రోత్సవంలో ప్రశంసలు దక్కాయి. బాలీవుడ్ మీద అంతర్జాతీయ అభిప్రాయాన్ని మార్చేందుకు ఇది ఉపయోగపడింది.

● ప్రస్తుత కాలంలోని సామాజిక, రాజకీయ పరిస్థితుల గురించి చిన్నారులకు అర్థమయ్యే రీతిలో చెప్పేందుకు 'షాడోస్ ఆఫ్ ది మహాభారత' చిత్రాన్ని రచించింది. ఈ చిత్రాన్ని నిర్మించేందుకు వాల్ట్ డిస్నీ ఇండియా సంస్థ ముందు కొచ్చినా ఆర్థిక కారణాలతో పూర్తి చేయలేదు. ఈ చిత్రం కోసం ఆమె ఏకంగా ఏడాదిన్నర పనిచేసింది.

● 2011లో కేన్స్ క్రిటిక్స్ వీక్‌లో భాగమైన షార్ట్ ఫిల్మ్ న్యాయనిర్ణేతల బృందంలో ఆమె ఒకరు. ఆ తర్వాత మరికొన్ని అంతర్జాతీయ చిత్రోత్సవాల జ్యూరీలో సేవలు అందించింది.

● మన ఆకాంక్షల్ని సెల్ఫీల్లో అద్దంపడితే ఎలా ఉంటుందా అనే దానిపై 'విష్ఫీ' అనే ఆల్బమ్ విడుదల చేసింది. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. చేగువెరా, ఫ్రీదా కల్హో, సైమన్ డి బ్యూవర్, టర్కోవ్‌స్కీ, అమృతా షేర్గిల్, స్మితా పాటిల్, మధుబాల, గురుదత్ వంటి ప్రముఖుల చిత్రాల్ని జతచేసి ఆమె దిగిన సెల్ఫీల్ని చాలామంది ఫాలో అయ్యారు. ప్రఖ్యాత తైల వర్ణచిత్రాల్లోను తన ఆకాంక్షల్ని ప్రతిఫలించేలా దిగిన సెల్ఫీలు కళాత్మకతను జోడించాయి.

● ఇప్పటి వరకు ఆమెకు 28కి పైగా అంతర్జాతీయ అవార్డులు దక్కాయి. వాటిల్లో ప్రఖ్యాత కొడాక్ షార్ట్‌ఫిల్మ్ అవార్డు, యంగ్ క్రిటిక్స్ అవార్డులాంటివి ఉన్నాయి.

● జపాన్, రష్యా, పోలండ్ వంటి దేశాల్లో యానిమేషన్ చిత్రాలకు ఆదరణ ఎక్కువ. పెద్దవారు కూడా వీటిని చూస్తారు. అలాంటి ఆదరణ ఇక్కడ కూడా వస్తే మరికొంత మంది గీతాంజలిలను మనం చూడొచ్చు.

- జేమ్స్

నవ్వుల్ - పువ్వుల్

విదేశాలు



టీచర్ : చింటూ నీకు తెలిసిన కొన్ని దేశాల పేర్లు చెప్పు?
చింటు : ఆదేశం, ఉపదేశం, సందేశం టీచర్.

కాస్త లేటుగా

అప్పారావు : నీ వయసు పదిహేనా...అదేంటి మరి మీ డాడీ నాకు 20 అని చెప్పాడే...
వెంకట్ : అంటే నేను లెక్కించడం నేర్చుకుంది ఐదో ఏట నుంచే కదా!

బంధం



రంగారావు : ఒక పెళ్ళి ఇద్దర్ని కలుపుతుంది.
రాజా : ఒక దొంగతనం నలుగురిని కలుపుతుంది.
రంగారావు : అదెలా....?
రాజు : అదే దొంగ, పోలీసు, లాయర్, జడ్జి....

కిసుక్కు



గోపాల్ :ఇదిగో ఈ ఆనకట్ట దగ్గరే నీటి నుంచి కరెంటు తీస్తారు.
వెంగళప్ప : అంటే తీయక ముందు ఈ నీటిని ముట్టుకుంటే షాక్ కొడతాయా??!

పరీక్ష



భార్య : మన అబ్బాయి నిమిషానికి పది తుమ్ములు తుమ్ముతున్నాడు.! ఏమైందో ఒక సారి టెస్ట్ చేయించాలండీ.
భర్త : నేను ఇందాకే టెస్ట్ చేశా....నిమిషానికి తొమ్మిది తుమ్ములే తుమ్ముతున్నాడు.

అతి తెలివి

భర్త : ఇదిగోనోయ్...పట్టుచీర!!
భార్య : మామూలు చీర కొనుక్కొచ్చి పట్టుచీర అంటారేంటి.
భర్త : అదే నీ మంకుపట్టుతో కొన్నా కదా.... అందుకే...
భార్య : ఆ.....

కిసుక్కు సిత్రం

పకడో పకడో చల్ పల్లీ పకడో..!

నాకు నచ్చిన చిత్రం



ఇల్లస్ట్రేటర్: కొరెన్ షాడ్మీ

సేకరణ : పి.బాలు, మచిలీపట్నం

శ్వాసిస్తేనే సాధించగలం

- బెండాళం క్రిష్ణారావు
bendalamkrishnarao@gmail.com

మనసు బలంగా ఉంటే బతకడానికి ఏదో ఒక మార్గముంటుంది. అదే బలహీనమైపోతే అన్ని దారులూ మూసుకుపోతాయి. అప్పుడు ఎలాగోలా ఈ జీవితాన్ని చాలించడమే అన్ని సమస్యలకూ ఏకైక పరిష్కారం అనే తప్పుడు భావనలో పడిపోతుంటారు కొంతమంది. కానీ ఇది అర్థరహితమైనది. క్షణికావేశం హత్యకో... ఆత్మహత్యకో ప్రేరేపణగా నిలుస్తుంది తప్ప జీవన శ్వాసని అందించలేదు. తన భవితవ్యాన్ని భయానికి ముడిపెట్టి బతుకు మీద విరక్తితో ఆత్మహత్యలు చేసుకుంటున్నవారంతా తమ కన్నవారికీ, కట్టుకున్నవారికీ, కడుపున పుట్టినవారికీ తీరని దుఃఖాన్నే మిగులుస్తున్నారు. అయితే జీవితం సమస్య కాదు, పరిష్కరించడానికి. జీవితం ఓ వాస్తవం, హృదయపూర్వకంగా ఆమోదించాలి. వాస్తవాన్ని వాస్తవంగానే స్వీకరించాలి. ప్రతికూల ఆలోచనలను తరిమికొట్టాలి. సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ వారం అట్టమీది కథ.

ఈ మధ్య ఓ ఆన్‌లైన్ గేమ్ పెద్దవాళ్లను గడగడలాడిస్తోంది. దాని పేరు 'బ్లూవేల్'. ఉడుకు రక్తంతో ఉండే టీనేజర్లను ఇట్టే ఆకర్షించే ఈ సవాళ్ల ఆట చివరకు.. ఆటగాళ్ల ఆత్మహత్యలకు దారితీస్తోంది. 2016లో రష్యాలో 16 మంది అమ్మాయిల ఆత్మహత్యలు జరగడంతో దీని తీవ్రత తెలిసింది. అర్జెంటీనాలో కేవలం 12 ఏళ్ల వయస్సున్న బాలిక ఈ ఆట వల్ల గాయపడింది. మనదేశంలో తిరువనంతపురం, ముంబై, ఇండోర్, సోలాపూర్, పశ్చిమ మిడ్నాపూర్, మధురైలకు చెందినవారు ఈ గేమ్ వల్ల ఆత్మహత్యా ప్రయత్నాలు చేశారు. మధురైలోని బాధితుడి ఫోన్‌ను పోలీసులు పరిశీలిస్తే ఆ గ్రూప్‌లో 75 మందికి పైగానే ఈ గేమ్‌ను ఆడుతున్నారని తెలిసింది. ప్రపంచవ్యాప్తంగా ఈ గేమ్ వల్ల 130 మంది ఆత్మహత్య చేసుకున్నారని అంచనా. వీరంతా కూడా సరైన లక్ష్యం.. దిశ.. గమ్యం లేక, అసంతృప్త జీవితాల్ని వెళ్లదీస్తున్నవారేనని మానసిక నిపుణుల మాట. కుటుంబ సభ్యుల్ని హతమారుస్తామంటూ ఆట వ్యవహారకర్తల బెదిరింపుల వల్ల ఆటగాళ్లు తనువులు చాలించడం అనే మరో కోణం కూడా ఉంది. టీనేజర్ల బలహీనతల్ని వ్యవహారకర్తలు ఆధారం చేసుకున్నారని తెలుస్తోంది. 'బ్లూవేల్' ఒక్కటే మనకు తెలిసింది. ఇలాంటివెన్నో ఇప్పుడు అంతర్జాలంలో కాచుక్కూర్చున్నాయి. చైనాలో 'హ్యూమన్ ఎంబ్రాయిడరీ' ఆన్‌లైన్ గేమ్ కూడా ఈ తరహాలోనిదే. అడగ్గానే పిల్లలకు ట్యాబ్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు ఇచ్చేస్తూ వాటితో వారేం చేస్తున్నారనే గమనిక లేకుండా పెద్దలు పోటీ జీవితాల్లో తలమునకలవ్వడమే 'బ్లూవేల్'లాంటి దారుణాలకు ప్రధాన కారణం. సిస్టమ్‌ను లివింగ్ రూమ్‌లో ఉంచుకుంటే ఎవరో ఒకరు పిల్లల్ని కనిపెట్టుకుంటారనే స్పృహ ఎంతమందికి ఉంది. ఇదివరకు పెద్దల సమక్షంలోనే టీవీ చూసే ఏర్పాటు ఉండేది. ఇప్పుడిలాంటిది గ్యాడ్జెట్ల వినియోగంలోనూ ఉండాలి. టీనేజర్ల జీవితాల్లోకి మరీ చొచ్చుకెళ్లి గమనించడం వారికి సహజంగానే ఇష్టముండదు. కానీ, వారికి అర్థమయ్యే రీతిలో చెప్పి వారి నమ్మకాన్ని పొందితే చాలా విషయాలు పెద్దలతో చర్చించాకే ముందుకెళ్లే పరిస్థితి ఉంటుంది. అదే పనిగా తలుపు బిగించుకుని గంటల తరబడి సిస్టమ్ ముందే గడిపేయడం, స్మార్ట్‌ఫోన్లలో తెల్లవార్లూ మునిగి తేలడం వంటివి, ఆన్‌లైన్ గేమ్‌ల గురించి మిత్రులతో పదేపదే చర్చిస్తూ ఏదో విషయంలో భయపడుతున్నట్టు టీనేజర్లు కనిపిస్తుంటే ఏదో సమస్య ఉందని పెద్దలు వెంటనే గుర్తించాలి. బ్లూవేల్ గేమ్ వల్ల వందల సంఖ్యలో ఆత్మహత్యలకు ప్రయత్నించిన వాళ్లవన్నీ కూడా తమ పరిణతికి మించి అర్థం చేసుకునే విషయాలు.. తమ సామర్థ్యాలకు మించి ఏర్పడిన భయాలే కారణం. సామాజిక మాధ్యమాల వల్ల పరిచయం లేని వ్యక్తుల చేతుల్లోకి వ్యక్తిగత సమాచారం తేలిగ్గా చేరడం, వారు వాటి ద్వారానే బెదరింపులకు పాల్పడి టీనేజర్లను లోబరుచుకోవడం.. పెద్దలకు ఈ విషయాల పట్ల అవగాహన కలిగే లోపు అనర్థాలు జరిగిపోవడం గమనార్హం. సరైన సమయానికి స్పందిస్తే ఇవన్నీ కూడా ఆపగలిగేవే.

పక్కదారి పట్టిన సాంకేతికత

నయా సాంకేతిక పరిజ్ఞానం అనైతిక వినియోగాలు కొత్త పుంతలు తొక్కుతూ మానవ మానసిక పరిస్థితిపై మరణ మృదంగం మోగిస్తోంది. సామాజిక జ్ఞానం లేని నాసిరకం డిగ్రీల మార్కుల చదువులు యువతలో భరోసా



ఇవ్వలేక పోగా నామోషితో చేయలేని చిన్న చిన్న ఉద్యోగాలు, యువ బతుకులను నిరాశ ఒత్తిళ్లలోకి నెట్టి వేస్తున్నాయనడంలో అసత్యం లేదు. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానాలెన్నో వున్నాయి. వినియోగ సమతుల్యతలు లేవు, విధానాలెన్నో వున్నాయ్, విలువలు లేవు. సాంప్రదాయాలెన్నో ఉన్నాయి వాటి గుణ గణాల అంచనాలు లేవు. మూఢ విశ్వాసాల నిర్మూలనలకు శాస్త్రీయ దృక్పథాలు కొరవడుతున్నాయి. చదువులు కొంత జ్ఞానం పెంచవచ్చు కానీ వేగవంతంగా మారుతున్న సామాజిక పరిణామాలలో మంచి, చెడులు, అనుకూల, ప్రతికూలతలను అర్థంచేసుకొని ఎదుర్కోగలిగే బతుకు భరోసాలు నేటి విద్యా వ్యవస్థలో లేవు. దానికి తోడు కుటుంబ సంబంధాల్లో పెరుగుతున్న మానసిక దూరాలు, అవసరానికి మించిన కోర్కెల వలయాలతో ఆర్థిక స్థితిగతులు తలకిందులవటం కూడా ఈనాటి ఈ ఆత్మహత్యల సంఘటనలకు కారణాలౌతున్నాయి.

విచక్షణ కోల్పోయి...

ప్రేమ వైఫల్యం, నిరుద్యోగం, ఆర్థిక సమస్య, అనారోగ్యం... ఇలా ఆత్మహత్యకు ఏదో ఒక కారణం ఉండవచ్చు. కానీ, బతకడానికి వేయి బలమైన కారణాలు! ప్రతి మనిషిలోనూ అంతర్గతంగా సమస్యల్ని ఎదుర్కొనే 'ఇన్‌బిల్ట్' శక్తి సామర్థ్యాలు పుష్కలంగా ఉంటాయి. వాటిని సమర్థంగా వాడుకుంటే... చావు ఆలోచన రానేరాదు. ఈ ప్రతికూల ఆలోచనలు ముందు మనసుని లొంగదీసుకుని, ఆ తర్వాత దేహాన్ని కూడా తమకు బానిసగా మార్చుకుంటాయి. పరీక్ష పాసు కాలేదని ఒకరు, పాసైనా మంచి మార్కులు రాలేదని ఒకరు, వచ్చినా కోరుకున్న కాలేజీలో సీటు దక్కలేదని ఒకరు, వచ్చినా క్యాంపస్ ఇంటర్వ్యూలో నచ్చిన ఉద్యోగం రాలేదని ఒకరు, ప్రేమ విఫలమైందని ఒకరు, ప్రేమ ఫలించినా అది పెళ్లి దాకా వెళ్లలేదని ఒకరు, అప్పుల బాధతో ఒకరు, అనారోగ్యంతో ఒకరు, భర్త పుట్టింటికి పంపలేదని ఒకరు, భార్య టీవీ రిమోట్ ఇవ్వలేదని ఒకరు, భర్త సినిమాకు తీసుకెళ్లడానికి ఒప్పుకోలేదని ఒకరూ.. జీవితంలో ఎదురయ్యే సమస్యకూ, సమస్య కాని దానికి కూడా ఆత్మహత్యలోనే పరిష్కారాన్ని వెతుక్కునే బలహీనమైన మనస్తత్వాలు పెరిగిపోయాయి. అందువల్ల ఏ రోజు ఎక్కడ ఏ ఫ్యానుకు ఉరితాడు బిగుసుకుంటోందో? ఎక్కడ నిద్రమాత్రలు శాశ్వత నిద్రలోకి నెట్టేస్తాయో? ఏ పురుగుల మందు ఎవరికి పరమాన్నంగా మారుతోందో? ఎక్కడో వెలిగిన అగ్గిపుల్ల ఏ శరీరాన్ని దహించేస్తుందో? మన దేశంలో ఆత్మహత్యలు నిమిషానికి రెండు, మూడు చొప్పున జరుగుతున్నాయి. ఆత్మహత్యల్లో విఫలమైనవారు కూడా సగం కాలిన శరీరంతోనో, ఒంటినిండా గాయాలతోనో జీవితాంతం పశ్చాత్తాపపడుతూనే ఉంటారు.

ఒంటరి కుటుంబాలు.. మూఢభక్తి

ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ శాసిస్తున్న సమాజంలో వ్యక్తిగత కుటుంబాలు బాగా పెరిగి ఉమ్మడి కుటుంబాలు రాను రానూ కనుమరుగౌతున్నాయి. ఇది కూడా ఎదిగే పిల్లల మానసిక స్థితిపై నిస్సహాయ ప్రభావాన్ని పెంచుతోంది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో తాతయ్యలు, అమ్మమ్మ, నానమ్మలు, బాబాయిలు, పెద్దనాన్నలు ఉండేవారు. కష్టమో.. నష్టమో వచ్చినప్పుడు ధైర్యం చెప్పేవారు. తమ అనుభవాలను చెప్పి మనోనిబ్బరాన్ని పెంచేవారు. కానీ చిన్న కుటుంబాలు పెరిగిపోవడంతో ఆ పరిస్థితి లేదు. ఇది కూడా ఆత్మహత్యలు పెరగడానికి కారణాలవుతున్నాయని మనస్తత్వవేత్తలు స్పష్టంచేస్తున్నారు. మూఢభక్తి కూడా మనిషిని మూర్ఖునిగా తయారు చేస్తోంది. మూఢభక్తితో, మౌఢ్యంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నవారి సంఖ్య కూడా బాగా పెరుగుతోంది. రెండు నెలల కిందట తూర్పుగోదావరి జిల్లా కరపలో మూఢభక్తితో ముగ్గురు మహిళలు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఒక ఉదాహరణ మాత్రమే!

బతుకంటే భయం ఎందుకు?

నిలువెల్లా నిరాశ ఆవరించినప్పుడూ, నిస్పృహ కమ్మేసినప్పుడూ, నిస్సహాయత సవాల్ చేస్తున్నప్పుడూ... మనసు తెగిన గాలిపటం

మహిళలు మేల్కోవాలి

మహిళల్లో ఆత్మహత్యకు కారణాలను వెదికినప్పుడు ముఖ్యంగా వారి సాంఘిక, సామాజిక, మానసిక అంశాలను పరిగణించాలి. కుటుంబంలో మహిళ పోషించే పాత్ర పురుషుడి కన్నా భిన్నంగా ఉండడమే దీనికి కారణం. వారి వయసును బట్టి కూడా ఆత్మహత్యా కారకాలు మారిపోతూ ఉంటాయి. 5 నుంచి 15 ఏళ్ల వయస్సు మధ్య వారికైతే.. దానికి కారణాలు చైల్డ్ అబ్యూజ్, తలిదండ్రుల నిరాదరణ, విముఖత మొదలైనవి. 16-25 ఏళ్ల మధ్య వయసు వారికైతే ప్రేమ, ర్యాగింగ్ వంటివి. 26-35 ఏళ్ల మధ్య గృహ హింస, రిలేషన్‌షిప్ సమస్యలు, ప్రెగ్నెన్సీ సమస్యలు, అత్తవారింటి వేధింపులు, పని చేసే చోట్ల వేధింపులు, 36-50 ఏళ్ల మధ్య వివాహేతర సమస్యలు, హార్మోనుల హెచ్చుతగ్గుల వల్ల, 50 నుంచి ఆ తరువాత కాలమంతా.. ఏకాకితనం లేదా భర్త, ప్రేమికుడు, పిల్లల నుండి దూరమైపోయిన భావన ఇలాంటివన్నీ వారిని ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నాయి. ఇతరులతో తమను తాము పోల్చుకుని ఆత్మన్యూనతకు లోనై చనిపోయేవారి సంఖ్యా చాల ఎక్కువ. వీటిని పరిశీలించి వారిలో మానసిక భరోసా నింపి ఆ ఆలోచన నుంచి దూరంగా వెళ్లేలా చేయాలి.

స్రవంతి ఐతరాజు,
సైకాలజీ ప్రొఫెసర్, మ్యుజీషియన్, తిరుపతి

అవుతుంది. పిచ్చిపిచ్చి ఆలోచనలన్నీ మెదడుని చుట్టుముట్టేస్తాయి. ఆ క్షణంలో.. బలహీనపడితే మాత్రం, నిరాశావాద భావనలు నెత్తికెక్కుతాయి. ఆ స్థితిలో సరైన నిర్ణయాలు తీసుకోవడం కష్టమే. ఆత్మహత్యల్లో 80 శాతం వరకూ ఈ దశలోనే జరిగిపోతాయి. ఆత్మహత్య ఆలోచన వచ్చిన వెంటనే ఎలాంటి నిర్ణయానికి రాకుండా తమకు తాము ఓ గడువు విధించుకోవాలంటారు మానసిక నిపుణులు – "ఒక నెల, పదిహేను రోజులు, వారం రోజులు – ఇలా అది ఎన్ని రోజులైనా కావచ్చు. ఇన్నాళ్లూ 'చస్తే ఎలా ఉంటుంది?' అనే ఆలోచించి ఉంటారు. ఈ కొద్ది సమయం మాత్రం 'బతికితే ఎలా ఉంటుంది?' అన్న కోణంలో ఆలోచించాలి. ఆ వ్యవధిలో ఎవరికి వారే ఓ అపురూప అతిథి. పొట్టచేత పట్టుకుని పొరుగు దేశాలకు వెళ్లే కాందిశీకులూ, కట్టుబట్టలతో వీధిపాలయ్యే భూకంప బాధితులూ, మృత్యువుతో పోరాటం చేసే ఎయిడ్స్ రోగులూ, కాళ్లూచేతులూ లేకుండా పుట్టిన మాంసపు ముద్దలూ, విభిన్న ప్రతిభావంతులుగా వైకల్యాన్ని జయించినవారంతా... ఇలా ఎంతోమంది కంటే మనం చాలా మెరుగైన స్థితిలో ఉన్నాం. వాళ్లెవరూ చావాలనుకోవడం లేదు. బతికి సాధించడానికే సిద్ధపడుతున్నారు. 'వాళ్లకు బతుకంటే భయం లేదు. మరి మనమెందుకు భయపడాలి' అని ఒకసారి ఆలోచించండి. జీవితంలో ఎదురయ్యే సమస్య తీవ్రత ఒక శాతమే, మిగతా తొంభై తొమ్మిది శాతాన్నీ భయమే ఆక్రమిస్తుంది. ఏ సమస్యా పరిష్కరించుకోలేనంత క్లిష్టమైనదైతే కాదు. భయంతో మనిషి అచేతనుడు అవుతాడు, అతన్లోని తెలివితేటలూ ధైర్యసాహసాలూ నిర్వీర్యమవుతాయి. భయాన్ని వీడాలంటే విచక్షణతో అభయాన్నిచ్చుకోవాలి. ఈ భయాన్ని వీడితే జయానికి దగ్గరైనట్టే. ఇక ఉరితాడు కలల్లేవు, మెడనిండా ఆశావాదపు విరిదండలే. ఇక పురుగుమందుల్లేవు, పాయసపరమాన్నాలే. ఇక నిద్రమాత్రల మత్తులేదు, నిత్య చైతన్యస్థితే. ఆ తేడా ఎవరికైనా స్పష్టంగా అర్థం అవుతుంది. మునుపట్లా, నెత్తిన కొండను మోస్తున్నట్టు వంగిపోరు. నిటారుగా నిలబడతారు, నిటారుగా నడుస్తారు, సూటిగా చూస్తారు, తడబడకుండా మాట్లాడతారు, ధైర్యంగా పోరాడతారు. అవసరమైతే, అంతకంటే ధైర్యంగా ఓడిపోతారు. తప్పనిసరైతే గెలిచేదాకా ఓడుతూనే ఉంటారు. భయంలేని ఓటమి... ఓ గొప్ప గెలుపు పాఠం.

గమనిస్తే...

ఆత్మహత్యలు వ్యక్తిగతమైనగా కన్పిస్తున్నా సమాజానికి కూడా చాలా ప్రమేయం ఉంటుంది. ప్రతి ఆత్మహత్య కేసులోనూ సమాజమూ సగం ముద్దాయే. సమాజం కాస్త చొరవ చూపగలిగితే, సకాలంలో స్పందించ గలిగితే ఎవరూ ఆత్మహత్య దాకా వెళ్లరు. ఆత్మహత్య ఆలోచనతో సతమతమయ్యేవారిని గుర్తించడం పెద్ద కష్టమేం కాదు. కళ్లలో నిరాశ కదలాడుతూ ఉంటుంది. మాటల్లో నిస్పృహ తొంగిచూస్తూ ఉంటుంది. 'మళ్లీ కలుస్తామో లేదో', 'బతికుంటే చూద్దాం..', 'నేను చస్తే పీడా విరగడ అవుతుంది' తరహా మాటలు వారి నుంచి యథాలాపంగా దొర్లేస్తుంటాయి. అటువంటి వారి ఫేస్‌బుక్ వ్యాఖ్యల్లోనూ బ్లాగు రచనల్లోనూ ఆ నిరాశావాదమే ప్రతిబింబిస్తూ ఉంటుంది. ముందుగానే నిద్రమాత్రల్ని సేకరించి తమ దగ్గర పెట్టుకోవడం, చివరి లేఖ సిద్ధం చేసుకోవడం, వారు సాహిత్యరంగంలో ఉన్నవారైతే చావుని ఆహ్వానిస్తూ, కీర్తిస్తూ కవిత్వం రాసుకోవడం లాంటి లక్షణాలను గమనించవచ్చు. మరికొంతమందిలో చావు ఆలోచనతో నిద్రలేమి వేధిస్తూ ఉంటుంది.

ఏ విషయాలలోనైనా మనల్ని ఇతరులతో పోల్చి చూసుకోవటం... మనలో పెరిగే ఉద్వేగాలకు కారణాలవుతాయి. ఆత్మహత్య ఆలోచనలను అధిగమించాలని ప్రయత్నిస్తే పరిష్కారాలు మన ముందే ఉంటాయి. అందుకై మన శక్తి సామర్థ్యాలపై మనకు మనం భరోసా పెంచుకోవాలి.

పరిష్కారం మన కళ్లముందే

మనం పని చేసే ఏ రంగంలోనైనా దానికి సంబంధించిన అవగాహన పెంపొందించుకోవాలి. ఏ సమస్యనైనా అర్థం చేసుకొనే విచక్షణకై అనుభవజ్ఞులైన పెద్దల సహాయం తీసుకోవాలి. ఉద్రేకపడే ప్రతి క్షణంలో.. జీవితం విలువ గుర్తిస్తూ మనకై జీవించే వారిని గుర్తు తెచ్చుకుంటూ ఉండాలి. ఉపద్రవాల పట్ల అత్యంత జాగరూకత పెంచుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాల పట్ల కచ్చితమైన నియంత్రణ కలిగి ఉండాలి. ప్రభుత్వపరంగా కూడా సాంకేతిక విజ్ఞానాల వినియోగంలో అనైతిక ప్రయోగాలపై కఠిన చర్యలు. మానసిక సమతుల్యత దెబ్బతీసి ఉద్రేకాలు రెచ్చగొట్టే వెబ్ సైట్ల ప్రసారాల పట్ల నియంత్రణ, కఠిన శిక్షలు అమలు జరగాలి. విద్యావ్యవస్థలో చదువులు మార్కులకే పరిమితం చేయకుండా మానసిక పరిణితిని పెంచే పాఠ్యాంశాలకు ప్రాధాన్యతలు కల్పించాలి. దీనికై మొదట ఉపాధ్యాయులలో సమాజంలో వీరి బాధ్యత, ప్రాముఖ్యతకు అవసరమయ్యే అంశాలకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి. వీటికి సామాజిక శ్రేయోభిలాషుల సహకారం కూడా తోడైతే మరింత మెరుగైన ఫలితాలు పొందవచ్చు.

- అమరనాథ్ జాగర్లపూడి
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్,
హైదరాబాద్



ఒక్క క్షణం ఆగి.. ఆలోచించాలి

ఆత్మహత్యలు చాలావరకు క్షణికావేశంలోనే జరుగుతుంటాయి. అందుకే ముందుగా ఆ ఆవేశాన్ని నిగ్రహించుకోవాలి.

○ కొద్దిసేపు మౌనంగా ఉండటం అవసరం.

○ కొన్ని నిమిషాలపాటు అంకెలు లెక్కపెట్టాలి.

○ కడుపు నిండా చల్లటి నీరు తాగాలి.

○ ఒంటరిగా ఉండకుండా మీ సమస్యను స్నేహితులతోను, తోబుట్టువులతోను, మీకు నచ్చిన వారితో పంచుకోవాలి .

తల్లిదండ్రులు ఏంచేయాలి ?

○ తల్లిదండ్రులు కూడా వారి పిల్లల చేసే ఆకతాయి పనులకు పదే పదే.. అదేపనిగా మందలించడం, పదుగురి మధ్య ఆ విషయాలు చెప్పి అవమానించడం చేయకూడదు.

○ పిల్లలు పూర్తిగా టి.వి.లకో, వీడియో గేములకో పరిమితమై ముభావంగా ఉంటే వారిని కాస్తా కుటుంబ వ్యవహారాల్లో పాలుపంచుకునేలా చేయాలి.

○ పరధ్యానంగా ఉండటం, భోజనం పై ఆసక్తి చూపకపోవడం లాంటివి చేస్తుంటే వారిపట్ల జాగ్రత్తలు తీసుకుని సామాజిక అంశాలపట్ల ఆసక్తిని పెంచాలి.

స్వభావంలోనూ ఏదో తేడా కనిపిస్తుంది. శారీరక పరిశుభ్రతను పెద్దగా పట్టించుకోరు. అపురూపంగా దాచుకున్న పుస్తకాల్నీ, పోటీల్లో సాధించిన పతకాల్నీ అందరికీ ఉదారంగా ఇచ్చేస్తుంటారు. ఒక్క ఆత్మీయులు మాత్రమే, ప్రవర్తనలోని ఆ తేడాల్ని స్పష్టంగా కనిపెట్టగలరు.

ఓ ఓదార్పుతో...

జీవితంలో కుంగిపోయి ఆత్మహత్య ఆలోచనల్లో ఉన్నవారికి మానసిక ఓదార్పు చాలా అవసరం. చావాలనుకునే మానసిక స్థితిలో ఉన్నవారిని కాస్త కదిలిస్తే చాలు, కన్నీరై ప్రవహిస్తారు. అయినా ఏం ఫర్వాలేదు ఏడ్వనివ్వండి, గుండె తేటపడే దాకా ఏడ్వనివ్వండి. మాట్లాడనివ్వండి. నోరెండి పోయేదాకా మాట్లాడనివ్వండి. సమాజాన్నీ, స్నేహితుల్నీ, బంధువుల్నీ – తనంటే చిన్నచూపు చూస్తున్నవారినంతా తిట్టుకోనివ్వండి. కోపం తగ్గేదాకా తిట్టుకోనివ్వండి. మధ్యమధ్యలో వ్యాఖ్యానాలూ ఎత్తిపొడుపులూ వద్దేవద్దు. ఆ తర్వాత కూడా వారిని ఏకాంతంగా వదిలిపెట్టకూడదు. అవసరం అనిపిస్తే, మానసిక నిపుణుడిని సంప్రదించాలి. హెల్ప్‌లైన్లతో మాట్లాడేలా ప్రోత్సహించాలి. బతుకంటే మమకారం కలిగించే పుస్తకాల్ని చదివించాలి, జీవితంలో ఓడి గెలిచిన వ్యక్తుల్ని పరిచయం చేయాలి. జీవితం విలువను చాటే మంచి సినిమాల్ని చూపించాలి. చాలా రకాల వైఫల్యాలు, కొన్నిసార్లు హార్మోన్లలో తేడాలు కూడా డిప్రెషన్‌లోకి తోసేస్తాయి. ప్రతి ఆత్మహత్య ఆలోచనా చావు కోసం తీవ్ర ప్రయత్నం కాదు. అలా అయినా, అయినవారో ఆత్మీయులో తమను పట్టించుకుంటారన్న ఆరాటం. వాళ్ల దృష్టిని తమ వైపునకు మళ్లించుకోవచ్చన్న ఆశ. ఆ దుర్భల పరిస్థితిలో ఏ చిన్న ఆసరా దొరికినా, జీవితం మీద మమకారం తిరిగి మొలకెత్తుతుంది. మళ్లీ మామూలు మనుషులు అవుతారు. అందువల్ల చిటికెడంత ఓదార్పు నిలువెత్తు జీవితానికి ఆసరాగా నిలుస్తుంది. మనసు ముక్కలైపోయిందని బాధపడేవారికి ఇది ఒకటే చికిత్స. ఇదే ఆత్మీయుల గాఢ పరిష్వంగన. ఆ ప్రేమపూర్వక ఆలింగనంలో పగిలిన ముక్కలన్నీ అతుక్కుపోతాయి.

గంటకో విద్యార్థి ఆత్మహత్య

దేశంలోనే కార్పొరేట్ విద్యావ్యాపారానికి ద్వారాలు తెరిచిన నాటి నుంచీ విద్యార్థుల ఆత్మహత్యలు తీవ్రమయ్యాయి అని మానవహక్కుల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పరీక్షల్లో ఫెయిల్, ఎంచుకున్న కెరీర్ దిశగా వెళ్లలేని అశక్తత, చెడు వ్యసనాలు, పెడదారి పట్టిన టీనేజీ కుర్రాళ్ల వంటి సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయి. దీనికి తోడు తల్లిదండ్రుల ఆకాంక్షలను బలవంతంగా రుద్దుతున్న నేపథ్యంలో చిన్నారుల్లో ఒత్తిడి పెంచుతుంది. చదువు కోసం పెట్టింది పెట్టుబడి అని, దానిని విద్యార్థిపై రుద్ది తిరిగి సంపాదిద్దామన్న ఆలోచనలో ఉన్న తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన పరిస్థితులు ఉన్నాయని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. జాతీయ నేర రికార్డుల విభాగం గణాంకాల ప్రకారం 2016- 17లో దేశవ్యాప్తంగా సుమారు 9 వేల మంది చనిపోయారు. అంటే సగటున ప్రతి గంటకు ఒక విద్యార్థి అకారణ ఆందోళనలు, ఒత్తిళ్లకు గురై చనిపోతున్నారు. 2015లో చనిపోయిన విద్యార్థుల్లో లక్షలోపు ఆదాయం గల కుటుంబాలకు చెందిన వారు 70 శాతం మంది ఉండటం గమనార్హం. 2015లోనే 8,934 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడితే.. 2011-15 మధ్య ఐదేళ్లలో 39,775 మంది బాలలు ఆత్మహత్యలు చేసుకున్నారు.

పరిపక్వత అవసరం

జీవితంలో సమస్యలనేవి సర్వ సాధారణమైన విషయం. సమస్యలు లేని సమస్యలు రాని జీవితాలు బహుశా ప్రపంచంలో ఎవరికి సాధ్యం కాని విషయం. ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొనే మానసిక పరిణితి పెంచుకోవాలి. జీవితంలో పరిష్కారం లేని సమస్య ఉండదు అందుకే బతుకు కన్నీటి ధారలకు బలి ఇవ్వటం కాదు.. దీనికి శోధించి సాధించాలనే సంయమనం పట్టుదల అవసరం. జీవితంలో సమస్యలనేవి మానసిక దఢత్వానికి, పరిణితికి తమకై తాము జీవితంలో ఎదగటానికి పునాదులనేవి ఎట్టి పరిస్థితులలో ఎవ్వరూ మరువరాని సత్యం. జీవిత గమ్యంలో సమస్యల వలయాలు ఛేదించే నైపుణ్యాలు మనం పెంచుకోవాలి. చెట్టు కొమ్మ మీద కూర్చున్న పక్షికి కింద పడిపోతాననే భయం ఉండదు కారణం తనకు రెక్కలున్నాయనే భరోసా.. జీవితం పట్ల మన అవగాహనే మనకు భరోసా! సమస్యలు ఏ రూపంలోనైనా ఎప్పుడైనా ఎదురుకాక తప్పదు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని నిలవడంలోనే జీవన మాధుర్యం దాగుంది. ఎందుకంటే ప్రశాంతమైన కడలి.. నైపుణ్యంగల నావికుడిని తయారు చేయలేదు. ఎత్తుపల్లాలు లేని జీవితమెప్పుడూ, మనిషిని రాటుదేలేలా చేయలేదు. కష్టాలు కడళ్లూ, సమస్యల సుడిగుండాలూ ఉంటాయి, వాటిని దాటుకుంటూ పోవడమే జీవితం, శ్వాసిస్తూ సాగితేనే దేన్నయినా సాధించగలం. ★

భారత్‌లోనే అధికం

ఆత్మహత్యల్లో భారత దేశం ప్రపంచంలోనే ముందటిస్థానంలో ఉండటం ఆందోళన కలిగించే అంశం. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచంలో ప్రతి 40 సెకన్లకు ఒక ఆత్మహత్య జరుగుతుండగా, మన దేశంలో ప్రతి రెండు నిమిషాలకు ఒకరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ప్రపంచంలో జరిగే ప్రతీ మూడు ఆత్మహత్యల్లో ఒకటి భారత్‌లో నమోదవుతోంది. ఆత్మహత్యకు పాల్పడుతున్న వారిలో 15 నుంచి 29 ఏళ్ల లోపు వారే ఎక్కువ కావడం, మహిళల కంటే పురుషులే ఎక్కువ ఉండటం గమనార్హం.



మోడల్ దొంగ

ఒక ఏడాది క్రితం మెకీ అలాంటే లక్కీ ఓ దొంగ. ఇప్పుడు ఓ సూపర్ మోడల్. ఇలా ఎలా మారిపోయిందంటే అతడి 'మగ్‌షాట్' అదేనండి పోలీసులు పట్టుకున్నాక ఫొటోలు తీసుకుంటారే ఆ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లోకి చేరిపోయాయి. 'వేక్ మగ్‌షాట్' అనే ఓ ట్విట్టర్ అకౌంట్ ద్వారా లక్కీ చిత్రం నెటిజన్ల దృష్టిలో పడింది. లక్కీకి ఓ కన్ను నీలి రంగులోను మరో కన్ను తేనె రంగులోను ఉండటంతో అతడి ఫొటో వైరల్ అయ్యింది. అలాగే మోడలింగ్ కావాల్సిన శరీర తీరు కూడా ఉండటంతో సెయింట్ క్లైర్స్ అనే మోడలింగ్ సంస్థ వెంటనే ఇతడితో ఓ కాంట్రాక్ట్ కుదుర్చుకుంది. మోడలింగ్ అంటే మంచి ఆదాయం రావడంతో లక్కీ దొంగ బుద్ధులు కూడా తగ్గాయి. మంచి కెరీర్, పేరు వీటన్నింటితో ఇప్పుడో 'మంచి దొంగ' ముద్ర పడింది. ఇప్పుడు లక్కీ ఎంత పాపులర్ అయిపోయాడంటే తమ మోడలింగ్ సంస్థ హోమ్ పేజీ మీద కూడా ఇతగాడి చిత్రమే కనబడుతోంది. ఈ 5 అడుగుల 10 అంగుళాల ఎత్తున్న అందగాడు ఇన్‌స్టాగ్రామ్‌లో కేవలం 19 పోస్టులు పెడితే ఏకంగా 22 వేల మంది ఫాలోవర్లుగా మారిపోయారు.



బుడగ మనిషి

సముద్రంలోని పీడనం మనిషి మీద ఎంత ప్రభావం చూపిస్తుందో తెలియాలంటే డైవర్ అలెజాండ్రో రామోస్ మార్టినెజ్‌ను చూస్తే అర్థమవుతుంది. వేగంగా ఈదుకుంటూ సముద్రం పైభాగానికి చేరుకోవడంతో అతడి శరీరం బెలూన్‌లా ఉబ్బిపోయింది. కేవలం 30 మీటర్ల లోతు తేడాలోనే పీడనం ప్రభావానికి గురయ్యాడు. దీన్ని 'డికంప్రెషన్ సిక్‌నెస్'గా పిలుస్తుంటారు. కణజాలంలోని, రక్తంలోని నైట్రోజన్ వల్ల బుడగలు ఏర్పడి ఇలా జరుగుతుంది. తల తిరగడం, కీళ్లవాపు... ఒక్కోసారి పక్షవాతం రావొచ్చు. చనిపోయే అవకాశం కూడా ఉంది. పెరూకు చెందిన మార్టినెజ్ సముద్రపు అడుగుకు చేరి సీఫుడ్‌ను తీసుకొచ్చే డైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు నాలుగేళ్ల క్రితమే ఈ ప్రమాదం జరిగింది. శరీరం ఉబ్బిపోవడమే కాక 30 కేజీల అదనపు బరువు పెరిగాడు. నాలుగేళ్లుగా ఎన్నో చికిత్సలకు హాజరవుతున్నా ఇప్పటికీ కోలుకోలేదు. కేవలం 30 శాతం మాత్రమే నైట్రోజన్ బుడగల్ని తొలగించగలిగారు. హైపర్‌బ్యారిక్ చాంబర్‌లో చేసే చికిత్సలో భాగంగా మరో 100 సెషన్స్‌కు వెళితే కానీ అతడికి పూర్తిగా నయమయ్యేలా లేదు. ఆక్సిజన్ థెరపీతో ఉబ్బును తగ్గించాక శస్త్ర చికిత్స చేయించుకోడానికి కుదురుతుంది. దాని ఖర్చు 60 లక్షల పైనే.

వింత లోకం

వెనుక ముఖం

క్రాప్ కొట్టడంలో సెర్బియాలోని నోవీ సాడ్‌కు చెందిన మారియో హ్వాలాకు మించినోడు లేడని అంటున్నారు అతడి హెయిర్ స్టయిళ్లు చూస్తుంటే. అభిమానాన్ని తలకెక్కించుకున్న బాబులంతా ఇతగాడి సెలూన్ ముందు క్యూ కడతారట. తమ ఆరాధ్య నాయకుడి గారి బొమ్మను తల మీద క్రాప్ కొట్టించుకోడానికే వీళ్లంతా వస్తారు. తల మీద ప్రముఖుల చిత్రాలను కటింగ్ చేయడంతో వీటిని 'హెయిర్ టాట్టూ'లని పిలుస్తున్నారు. వీటిని తాను స్లొవేకియాలో పనిచేస్తున్నప్పుడు 8 ఏళ్ల నుంచే క్షవరం చేస్తున్నాడు. ఓసారి ఎవరో కస్టమర్ వచ్చి తనకు రెండు నిలువు గీతలుగా క్రాప్ కొట్టగలవా అని అడిగాడట. 'ఓస్.. అది చాలా వీజీ' అంటూ ఏకంగా ఓ సాలీడు రూపాన్ని వేశాడు. దాంతో మాంచి క్రేజ్ వచ్చేసి ఆ తర్వాత ఎన్నో విచిత్రాల్ని తలల మీద కత్తిరించి చివరకు సొంత దేశం వచ్చేశాడు. ఇక నాలుగేళ్లుగా సెర్బియాలో సెలబ్రెటీ క్షురకుడైపోయాడు. మారియో ప్రతిభతో ప్రఖ్యాత శాస్త్రవేత్త నికొలస్ టెస్లా, టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిక్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ వంటి ముఖాలను అభిమానుల ముఖం వెనుక చూసుకోవచ్చు. ఒక్కో కటింగ్‌కు 3-5 గంటల సమయం పడుతుంది. సుమారు ఏడు వేల రూపాయలకు పైగానే చెల్లించి ఈ క్రాప్ చేయించుకుంటున్నారు. 10 రోజుల్లో తిరిగి జుట్టు పూర్తిగా పెరిగి చిత్రం చెదిరిపోతున్నా సరే.

తెలుసా

మన రెడ్ పాండా

- 1820లో మొట్టమొదట రెడ్ పాండాలని చైనాలో గుర్తించారు. అప్పుడు మాత్రం వాటిని పాండా అనే పిలిచేవారు.
- మొజిల్లా ప్రధాన బ్రౌజర్ 'ఫైర్ ఫాక్స్' లోగో రెడ్ పాండా బొమ్మలో రూపొందించబడింది. ఎరుపు రంగులో వుండే ఈ పాండాలకి 'ఫైర్ ఫాక్స్' అనే పేరు వాడుకలో ఉంది.
- పాండా అనే పేరు నేపాలీ పదం పొన్య ద్వారా వాడుకలోకి వచ్చింది.
- రెండ్ పాండాల శరీరాకృతి, రంగుల్లో 140 సంవత్సరాలుగా అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

- పాండా పేరు చెప్పగానే మనకి గుర్తొచ్చేది తెలుపు, నలుపు రంగుల్లో పెద్ద పరిణామంలో ఎలుబంటి ఆకారాన్ని పోలిన ఓ జంతువు. వీటికంటే ముందు ఆ పేరు వచ్చింది రెడ్ పాండాలకే.
- రెడ్ పాండా పేరు దాదాపు 50 ఏళ్ల క్రితం నుండే వాడుకలో వుంది.
- శరీరాకృతిలో పాండాలని పోలి ఉన్నా రెడ్ పాండాలు ఎలురైడ్ జాతికి చెందినవి.
- రెడ్ పాండాలు మనదేశంతోపాటు నేపాల్, మధ్య చైనా, ఉత్తర మయన్మార్ పర్వతాలు, అధిక ఎత్తులో ఉన్న సమశీతోష్ణ అడవులు, ఉష్ణమండల అడవులలో ఎక్కువగా నివసిస్తాయి.

- వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్ లెక్కల ప్రకారం ప్రస్తుతం మనుగడలో వున్న రెడ్ పాండాల సంఖ్య 10,000 కంటే తక్కువ.
- లండన్, బర్మింగ్‌హమ్, రూటర్ డ్యామ్ జూ నుండి 1978లో అధిక సంఖ్యలో తప్పించుకున్న రెడ్ పాండాల్లో సజీవంగా ఉన్నవి అతి తక్కువనేది ఒక నివేదిక.

- రెడ్ పాండా మాంసాహార జంతువే అయినా అవి ఎక్కువగా వెదురుని లాగించేస్తాయి. ఇవి దాదాపు 80 శాతం వెదురుని ఆహారంగా తీసుకుంటాయి.
- 'కుంగ్ ఫు పాండా' చిత్రంలో 'షిఫు' క్యారెక్టర్ రెడ్ పాండాని పోలినదే.
- చెట్లపై ఎక్కువగా వుండే పాండాలు పక్షుల్లా కిచకిచ శబ్దాలని చేయగలవు.
- పాండాలు చెట్లు ఎక్కే సమయంలో పట్టుతప్పకుండా వుండేలా ఉపకరించేది వాటి కాలి వేళ్లలో పొడవుగా వుండే బొటన వేలు. నిజానికి ఇది పొడవుగా పెరిగిన మణికట్టు ఎముక.

- మన దేశంలో అరుణాచల్ ప్రదేశ్ (నమ్‌దఫ జాతీయ పార్కు), డార్జిలింగ్ (నియోరా వ్యాలీ జాతీయ పార్కు), సిక్కిమ్ (కాంచన్ గంగ జాతీయ పార్క్)ల్లో మాత్రమే మనం రెడ్ పాండాలని చూడగలం.



ఆపాత చిత్రం

అనుబంధాల సింధువు

ఇది తమిళ రీమేక్. తమిళ చిత్రంలోని గొప్పదనం ఎక్కడా తక్కువ కాకుండా అంతకుమించి ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దాడు పిఎస్ రామకృష్ణారావు. అది ఆయన గొప్పదనం. ఒకరాజు ఎస్వీ రంగారావు. ఒక రాణి కన్నాంబ... ఆ రాజుకి ఇద్దరు కొడుకులు వల్లం నరసింహారావు. ఏడిద నాగేశ్వరావు, ఒక కూతురు గిరిజ. ఆ ఇంట్లో పనివారు ఎన్టి రామారావు, సావిత్రి. వీరితోపాటు రేలంగి, సూర్యకాంతం, హరనాథ్ ప్రధాన పాత్రధారులు. ఆ రాజుగారి కొడుకులిద్దరూ స్వార్థపరులు. వారి స్వార్థం వారు చూసుకుంటూ తల్లిదండ్రుల్ని నిర్లక్ష్యం చేస్తారు. ఈ పరిణామానికి రాజూ రాణి లోలోపలే కుంగిపోతుంటారు. వారికి ఆత్మీయులూ ఆత్మంధువులు పనివాళ్లే. (ఎన్టి రామారావు, సావిత్రి) దీనిని అన్నదమ్ములూ, వారి భార్యలూ సహించలేకపోతారు. ఏదో ఒక నెపంతో వారి మీద నిందలు వేస్తుంటారు. కొత్త దంపతులైన యన్టిఆర్, సావిత్రిలపై తమ కొడుకుల మూలంగా నిందలు పడటం వారికిష్టముండదు. అందుకే ఇంట్లోంచి పంపించేస్తారు. బతుకు తెరువు తెలియని యన్టీఆర్, బతికే విధానం నేర్చుకుంటాడనే ఆంతర్యం కూడా దానిలో ఇమిడి ఉంది. ఇది అర్థంకాని ఎన్టిఆర్, సావిత్రి మధనపడతారు. తర్వాత కూతురు (గిరిజ) పెళ్ళి విషయంలో అపార్థాలు చోటుచేసుకొని ఆ గొడవ చిలికి చిలికి గాలివానవుతుంది. ఆ సంబంధం తప్పిపోతుంది. ఎన్టిఆర్ వెళ్ళిపోయిన తరువాత ఆ వెలితి యస్వీ.రంగారావుకి బాగా కనిపిస్తుంది. ఏ

పని చేస్తున్నా ఎన్టిఆర్ గుర్తుకొస్తాడు. తను కలలుగన్న కుటుంబం తన కళ్ళముందే సర్వనాశనం అయిపోతుంటే చూసి ఓర్వలేకపోతాడు. ఇష్టంగా సిగరెట్లు కాల్చే అలవాటున్న రంగారావు తన బాధను మరిచిపోవడానికి అదే పనిగా సిగరెట్లు కాలుస్తూ ఎన్.టి.ఆర్‌ని తలచుకొంటూ కుమిలికుమిలి ఏడుస్తూ చనిపోతాడు.

ఎన్టిఆర్ ఒక ఫ్యాక్టరీ యజమానిని ఆపద నించి కాపాడ్డంతో ఆ కంపెనీలో మెకానిక్‌గా ఉద్యోగం వస్తుంది. తను ప్రయోజకుణ్ణి అయ్యానని గొప్పగా చెప్పుకోడానికి వచ్చిన ఎన్టిఆర్–యస్వీఆర్ ఫోటోకి దండవేసి ఉండటం చూసి కన్నాంబ కాళ్ళమీద పడి కుమిలిపోతాడు. ఇది సినిమాకే హైలైట్‌గా నిలుస్తుంది. సావిత్రి సహనం, ఎన్.టి.ఆర్ మంచితనం.. ఎన్నో నిందలూ, నిష్టూరాలు అనుభవించినా చివరికి అందరిలో పరివర్తన వచ్చేలా చేసి తప్పిపోయిన సంబంధాన్ని కుదిర్చి తిరిగి పెళ్ళి చేస్తారు. కథ సుఖాంతమయ్యాక బరువుగా ఊపిరిపీల్చుకున్నా సినిమా చూసిన ప్రేక్షకుడెవరూ కథని మరిచిపోలేరు.

చిత్రంలో ప్రతి సన్నివేశం ఒక గుర్తింపుని కలిగి ఉంటుంది. ఈ 'సినిమా' ఎన్నో కుటుంబాల మీద చాలా ప్రభావం చూపించింది. ఈ చిత్రాన్ని చూసిన తల్లిదండ్రులు ఎన్.టి.ఆర్, సావిత్రిల పట్ల విపరీతమైన ప్రేమను పెంచుకున్నారు. వీరికి మాస్ ఫాలోయింగ్ పెరిగింది. ఈ చిత్రానికి యస్వీఆర్, కన్నాంబ, ఎన్.టి.ఆర్, సావిత్రి నాలుగు స్తంభాలుగా నిలిచారు.

పాటలు వజ్రాల మూటలు

తమిళ చిత్రానికి సంగీతం అందించిన కె.వి మహదేవన్ తెలుగు చిత్రానికీ సంగీతం అందించాడు. పాటలు అన్నీ సందర్భానుసారంగా పుట్టుకొచ్చినవే. సి.నారాయణరెడ్డి రాసిన పాట 'అనగనగా ఒకరాజు... అనగనగా ఒకరాణి.. రాజు మనసు వెన్న రాణి మనసు మిన్న' అంటూ పాటని ప్రారంభిస్తారు. ఈ పాటలోనే

ఆ రోజుల్లో చలనచిత్రాల నిర్మాణంలో తెలుగు, తమిళభాష నిర్మాతా దర్శకులు పోటీపడుతుండేవారు. ఒకరి కంటే మరొకరు చిత్రాల్ని జనరంజకంగా చేయాలని తపించేవారు. అంకితభావంతో సినిమాల్ని తీర్చిదిద్దేవారు. ఆ సినిమాలు పూర్ణాయుషుని సంతరింప చేసుకొనేవి. అలాంటి మేలిమి చిత్రాల్లో ఒకటి ఆత్మబంధువు! మానవ సంబంధాల నేపథ్యంలో నిర్మించిన చిత్రం ఇది. సినిమా చూస్తున్నంత సేపూ ప్రేక్షకుడి కళ్ళు చెమరుస్తాయి. పిఎస్ రామకృష్ణారావు దర్శకత్వంలో వచ్చిన చిత్రం ఇది.

సినిమా కథంతా ఉంటుంది. ముక్తాయింపుగా ఎన్.టి.ఆర్ మీద చిత్రీకరించిన మాటల్ని మరిచిపోలేము. 'కొడుకులతో పాటు రాజు కుక్కను పెంచి, ప్రేమయనీ పాలుపోసి పెంపు చేసెను.. చక్కటి పాప కన్న మిన్న ఆదరించెను. జాలిగుండెలేని కొడుకు కన్నా కుక్క మేలురా' అంటూ ముక్తాయిస్తారు సినారె. ఎన్నో సమకాలీన కుటుంబ సమస్యల్ని ఒక పాట రూపంలో ఎత్తి చూపించారాయన. మరో పాట సముద్రాల రాశారు. ఎవరో ఏవూరో... ఎవరు కన్నారో' ఈ పాటలో ఎస్వీఆర్ నటన అపురూపం. గుండెల్ని పిండేస్తుంది. ఈ పాటలోనే ఉపశృతిగా 'చెప్పినట్లు వినేను... సేవలు చేసేను.. కృష్ణయ్య ఉపకారమే ఇంటింటను పొందగలిగేను..' అంటూ.. సఖుడై, మిత్రుడై.. మంత్రియై.. కానరాని దేవుడై.. 'సేవకుడై.. కృష్ణయ్యా' అంటూ ఎన్.టి.ఆర్‌ని తలుస్తూ యస్వీఆర్ ప్రాణాలు విడిచిపెట్టిన పాట.. సముద్రాల అద్భుతంగా రాశారు. అంతే అద్భుతంగా ..స్వరరచన చేశారు మహదేవన్. ఈ పాటకి తమిళంలో వున్న ట్యూన్ అలాగే ఉంచేశారు. ఈ పాటకి యస్వీఆర్ నటన పతాకస్థాయిని చేరుతుంది.

కథానాయకుడ్ని ఉద్దేశించి కథానాయిక పాడిన పాట చదువురాని వారిలో వినూత్నమైన ఉత్తేజాన్ని నింపుతుంది. 'ఏమి చదివి పక్షులు పైకెగరగలిగెను... ఏ చదువు వల్ల చేపపిల్లలీదగలిగెను... చదువులతో పని లేదు హృదయమున్న చాలు.. కాగితము పువ్వు కన్నా..గరికపువ్వు మేలు' అంటూ ఓ గొప్ప జీవనసత్యాన్ని చెప్పారు సినారె. 'చీరగట్టి సింగారించి చింపితలకు చిక్కుతీసి. చక్కదనముతో సవాలు చేసే చుక్కలాంటి చినదానా' అని కొసరాజు రాసిన పాటని ఎన్టీఆర్, సావిత్రి మీద చిత్రీకరించారు. అమాయకుడైన భర్త, భార్య అందాన్ని ఇంతకంటే సహజంగా పొగడలేడు.

ఎక్కువ మార్కులు

తమిళ చిత్రం కంటే తెలుగుచిత్రం ఆత్మబంధువుకే ఎక్కువ మార్కులు వేశారు సినీ పరిశీలకులు. అందుకు కారణం ముగ్గురు నటులను చెప్పుకోవచ్చు. ఇక ఎస్వీఆర్ తమిళంలో కన్నా తెలుగులో అంతకుమించి చేశాడు. ముఖ్యంగా ఎవరో ఏవూరో... ఎవరు కన్నారో... ఈ విధి నిన్ను కొలువ... పాటలో ఎన్.టి.రామారావును ఉద్దేశించి పాడుతున్నది ఆ కాంబినేషన్‌ని దృశ్యరూపంలో చూడ్డానికి చాలా బాగుంటుంది. ఈ పాటకు యస్వీ రంగారావు, ఎన్టీ రామారావు జీవం పోశారు. ఎన్టీఆర్, సావిత్రి వీఆర్‌ని చూడ్డానికి వచ్చినప్పుడు భర్తను కోల్పోయిన కన్నాంబ గొప్ప నటన ప్రదర్శించింది. అప్పటికి యన్టీఆర్ ట్రాజెడీ సన్నివేశాల్లో అంత గొప్పగా చేసేవాడు కాడు. 'ఆ రోజు కన్నాంబని చూడగానే ఏదో పూనకం వచ్చినట్లయింది అలా చేసేశాను..' అని చెప్పారు ఎన్టీఆర్. తను అంతలా నటించడానికి మరో కారణం కూడా ఉంది. తమిళ వెర్షన్‌లో శివాజీ గొప్ప నటన ప్రదర్శించాడు. దాన్ని మించి చేయాలన్న ఆలోచన, ట్రాజెడీ సన్నివేశాల్లో అంతగా రాణించలేనన్న భయం వెరసి... తన సినిమాలో నటన పతాకస్థాయికి చేరుకుంది. ఇక సావిత్రి పాత్ర ఆమెకి నల్లేరు మీద నడకలాంటిది. పాత్ర ఔచిత్యం చెడకుండా ఆ పాత్రకి ప్రాణ ప్రతిష్ఠ చేసింది. ఈ చిత్రం ద్వారా ఎన్నో అవార్డులూ రివార్డులూ సొంతం చేసుకున్నారీ నలుగురు నటులూ!

దర్శకుడి ప్రతిభ

తమిళ ఆత్మబంధువులో సీరియస్‌నెస్ ఎక్కువ. ఓవర్‌డ్రామా ఉంది. అంత డ్రామాని తెలుగువారు రిసీవ్ చేసుకుంటారన్న నమ్మకం లేదు. అందుకే కథలో రేలంగి పద్మనాభం, సూర్యకాంతం పాత్రల ద్వారా లైటర్‌వే ట్రీట్‌మెంట్ నడిపించారు. అన్నిటికంటే మిన్నగా ఎన్టీఆర్ చేతనే నవ రసాల్ని పండించారు. అవసరమైన చోట మెలో డ్రామాని చొప్పించారు. స్వతహాగా సున్నితమైన స్వభావం గల రామకృష్ణారావు ఎన్నో సందర్భాల్లో కట్ చెప్పడం మరిచిపోయారట! 1962లో వచ్చిన ఆత్మబంధువు సూపర్ హిట్టయింది. అన్ని వర్గాల వారినీ అలరించింది. రాజాచంద్ర దర్శకత్వంలో వచ్చిన 'ఓ తండ్రి తీర్పు' చిత్రంలో తెలివిగా, అందంగా మలచుకొని జయభేరి సంస్థకి సూపర్‌హిట్ అందించారు. ఇందులో రాజాచంద్ర ప్రతిభ విశేషాలు అడుగడుగునా కనిపిస్తాయి.

యస్వీఆర్ హీరో కంటే ఎక్కువగా గుర్తింపు పొందారు. తెలుగు, తమిళ భాషల్లో సావిత్రి యస్వీఆర్‌ల కాంబినేషన్‌లో ఎక్కువ చిత్రాలు ఉండేవి. అందుకే హీరోతో సమానంగా ఎస్వీఆర్‌కి రెమ్యూనరేషన్ అందేది. ఒక్కోసారి హీరో కంటే ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకొనేవారు. సావిత్రి కూడా నటిస్తుంటే ఎక్కువ రెమ్యూనరేషన్ అడక్కుండా నటించేవారు. పోటీగా నటించడం అంటే అంతిష్టం ఎస్వీఆర్‌కి. అలా నటీనటులు పాత్రలకు ప్రాణం పోసేవారు. అందుకే ఆ సినిమాలు అపురూపాలు! అప్పటి సమాజానికి సజీవ సాక్ష్యాలు!

- ఇమంది రామారావు

9010133844

హద్దులు

విశాలమైన మహావిశ్వాన్ని
గురించి ఆలోచిస్తుండగా
కళ్లలోకి నిశీధి ఆవహించింది
కళ్లు మూశాకే కనబడింది
అదొక వెలుగుతున్న చీకటి
ఓ రూపమంటూ లేని విశ్వానికి
భూమండలం ఒక
గుండ్రటి నిశ్శబ్దపు
గుండెకాయలా కనిపించింది
నీటిలో తేలే మట్టిముద్దలపై
బతుకునీడ్చే దరిద్రులకి
కుల మత జాతి
భేదాలెందుకనిపించింది
వేష భాష దేశాలకు
హద్దులెందుకనిపించింది
శాశ్వతం కాని భూమ్మీద
యుద్ధాలెందుకనిపించింది
మానవత్వపు శిఖరాన్నందుకుని
ఈ ప్రపంచపు దిశనే
మార్చివేయాలనిపించింది...

- బ్రౌన్

8985759460

కవిత్వం

పచ్చని ప్రశ్న

జనం మధ్య
అదో పూనకం
ప్రతివాడికీ
ప్రచారానందం
కాసేపు హంగామా
రసపట్టులో డ్రామా
నాటి వదిలేస్తారు
ఫొటోలకు ఫోజులిచ్చేస్తారు
చేతులు దులిపేసుకుంటారు
ఆ తరువాత దిక్కెవరు
మొక్కనాటే నాయకా
ఇంతేనా పచ్చని బతుకు!
బతికున్న మమ్మల్ని
నాటి చంపేయడమేనా
అందుకేగా సూర్యుడికి కోపం
నిప్పులు చెరిగే రౌద్రం
కళ్లు తెరవాల్సిన సమయమిదే
ఇక ఉపేక్షిస్తే మానవా
పుడమికే ప్రమాదం!

- ఎన్.పి.కృష్ణమూర్తి

9966038800

కథ

తొలి అడుగు



- మొలకలపల్లి కోటేశ్వరరావు
email : mokorao@gmail.com

రమాదేవి స్కూల్ నుంచి ఇంటికి వచ్చేసరికి అమ్మా నాన్న ఎదురెదురుగా మంచాల మీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ ముఖాలు సంతోషంతో వెలిగిపోతున్నాయి. ఆ సమయంలో ఇద్దరూ పొలం పనులకో, పనులు లేకపోతే నాన్న వాళ్ళు అరుగు మీదకి పెత్తనాలకి వెళ్తే ఏదో పని చేసుకుంటూనే ఉంది. అలాంటిది, వాళ్ళు అలా కూర్చుని ఏదో సంతోషకరమైన విషయాన్ని మాట్లాడుకోవడం చూసి రమాదేవి ఆశ్చర్యపోయింది. పుస్తకాల సంచి అమ్మ కూర్చున్న మంచం మీద పడేసి, తొట్టి దగ్గరకి పోయి కాళ్ళూ చేతులూ కడుక్కుని వచ్చింది.

"రమా ... రోజూ పెందలకాడ వచ్చేదానివి, ఇయ్యాల ఇంత ఆలస్యం అయింది ఏందమ్మా?" అమ్మ అడిగింది.

"స్కూల్లో ఆడుకుని వస్తున్నానమ్మా!"

"ఈయాళ దాకానా?"

" రేపటినుంచీ ఇంకా ఎక్కువ సేపు ఆటలు వుంటయ్యి"!

"ఏం ఆటలే? నీకు ఆటల పిచ్చి ముదిరిపోయింది"

"పిచ్చికాదమ్మా! వచ్చే నెలలో టోర్నమెంట్స్ జరుగుతున్నయ్యి. వాటి కోసం ప్రాక్టీస్ చేస్తున్నాం. ఇంకా పది రోజులు రోజూ మాపుటిపూట ఆటలే ఆటలు!"

"సరేలే"!

"ఖోఖో కెప్టెన్ని నేనే!"

"ఏం ఆటలో, ఏం చదువులో! ఇంకా నువ్వు చిన్న పిల్లవి అనుకుంటున్నావేంది?"

"చిన్న పిల్లని కాక అమ్మమ్మనా, తాతమ్మనా, నాయనమ్మనా?"

"సరే, ఇట్రా. ఇయ్యి తీసుకో!"

"ఏంటియ్యా?"

'వచ్చిచూడు, తెలిసిద్ది!"

"హాయ్... లడ్డూ, మైసూరు పాకూ! ఎక్కడియమ్మా ఇయ్యా?" ఎగిరిగంతేస్తూ తీసుకుని, వెంటనే నోట్లో పెట్టుకుని తింటూ అడిగింది.

"మీ నాన్న ఇయ్యాల మీ చిన్నత్త వాళ్ళ వూరు పోయాడు. వస్తా కొనక్కొచ్చాడు నీ కోసం!"

"ఇంకేం తెచ్చాడు?"

"ఇంకానా? నీకు మంచి మనువు కూడా తీసుకొచ్చాడు!"

"పొమ్మా... మరీనూ! చిన్నత్త బాగుందా నాన్నా?"

"వాళ్ళకేం అమ్మా? చారెడో, దోసెడో భూమి వుంది. వడ్లు పండుతాయ్. బియ్యం కొనుక్కోవాల్సిన పని లేదు. ఒకరికి చెయి చాపాలని లేదు. మన మాదిరిగా పూరి గుడిసె కాకుండా మంచి ఇల్లు వుంది!"

"నవ్వు లాటకి కాదురా! మీ చిన్నత్త వాళ్ళ తోడికోడలు సూరమ్మ తెలుసుకదా? వాళ్ళ కొడుకు రమేష్‌కి నిన్ను చేసుకుంటామన్నారు. వాళ్ళంతట వాళ్ళే అడిగారంట మీ నాన్ననీ!"

" నాకిప్పుడేం పెళ్ళమ్మా?"

"పెద్దయినాక!"

"ఇప్పుడు నువ్వు చిన్నపిల్లవా? ఈడేరి రెండేళ్ళు అవతంది!"

"అయితే మాల్లే!"

" ఎదురింటి లింగమ్మ కూతురు రత్తి నీ ఈడుది కదూ? దానికీ నీకూ నాలుగు రోజుల తేడా! నీకంటే అది నాలుగు రోజులు పెద్దది. దానికి పెళ్ళయ్యి ఎంత కాలం అవతందీ? అదిప్పుడు లేవలేకుండా వుంది!"

"సరేలేమ్మో! పెద్ద చెప్పొచ్చావు!"

"కాదమ్మా రమా... ఇయ్యాల నేను మీ చిన్నత్తని చూద్దామని పోయాను కదా? వాళ్ళ

బావకొడుకు రమేష్‌గాడికి పిల్లని చూస్తున్నారంట! రమ అయితే బాగుండిద్దన్నా, మాట్లాట్టానికి నేను మన వూరు వద్దామనుకుంటున్నాను.. అంది మీ అత్త!"

"ఏం మాట్లాడిద్దంట, నేను చదువుకుంటంటే!"

ఏం చదువు? చదివిన కట్టుకి చాలదా ఏంది? బస్సుల మీద పేర్ల వరకూ చదివితే చాలు! నువ్వు తొమ్మిదో తరగతి! ఇంత చదువుకున్నోళ్ళు మన యానాదుల ఇళ్ళలో ఎవురు వున్నారు? ఈ చదువే గొప్ప!"

"తొమ్మిది అంటే అటూ ఇటూ కాని చదువు నానా! ఎందుకూ అక్కరకు రాదు. పది దాకా చదువుకుంటా! సర్టిఫికేటు వచ్చిద్ది! అసలు ఇయ్యాల దేనికైన పది తరగతులు వుండాల!"

"చదువుకి హద్దు ఏముందమ్మా? పది తరువాత ఇంకా పై చదువు అంటావు! అంతు ఎక్కడ?"

ఊళ్ళో బడి. రూపాయి ఖర్చులేదు. వాళ్లే పుస్తకాలు ఇస్తున్నారు. గుడ్డలు ఇస్తున్నారు. బడిలేని రోజు మీతో పాటు కూలికి వస్తున్నాను! నా ఖర్చులకి నేనే సంపాదించుకుంటున్నాగా?"

"ఖర్చుల ఎవారం కాదమ్మా! చెట్టుకి కాయ భారం అయిద్దా? నువ్వు మాకు భారమా? ఆడపిల్లవి! ఎప్పటికైనా పెళ్ళి చేసుకోక తప్పదు. మగ పిల్లోడివా... బలాదూర్‌గా తిరిగి రావడానికి! నువ్వు ఎప్పుడైనా ఆ...డపిల్లవే కానీ, ఈడ పిల్లవి కాదమ్మ!"

"నాకు ఏం చెప్పవాకండి నానా! నేను పదిదాకా చదువుకునేదీ, చదువుకునేదే!"

"చెప్పేమాట వినవే! నిన్ను కూలికీనాలికీ పంపించం అని చెప్పారంట! ఇంటికాడ పిల్లాజెల్లని సముదాయించుకుంటా మంచీసెబ్బర చూసుకుంటే చాలు! ఎండకి ఎండి, వానకి తడవాల్సిన పనిలేదు. నీడ పట్టున బతకొచ్చు. మన కొంపల్లో ఇంతకంటే మంచి సమ్మంధం దొరకటం జరిగే పని కాదు!" అమ్మ అంది.

"మీ అత్తకి పిల్లల్లేరు కదా! వాడి ఆస్తి కూడా వాడికే ఇస్తారంట! మీ అత్త వాళ్ల అర ఎకరం, వాళ్ళ అర ఎకరం! ఇద్దరి మీదా ఎకరం పొలం బంగారు మసుంటి మాగాణి! మన ఇళ్ళల్లో ఎవురికన్నా ఎకరం పొలం వుండిద్దీ? పిల్లోడు బుద్ధిమంతుడు. బాగుంటాడు. కాణీ కట్నం పనిలేదన్నారు. చూడు, ఇంటికి వచ్చి తలుపు తట్టిన అదృష్టం! కాలదన్నుకో కూడదు!" అన్నాడు నాన్న.

"పెద్దోళ్ళం ఎందుకు చెబుతున్నామో ఆలోచించుకో! లోకం పోకడ నీకు తెలియంది. ఏ వయసులో జరగాల్సిన అచ్చటాముచ్చటా ఆ వయసులోనే జరిగితే చందం! " నచ్చచెపుతూ అంది అమ్మ.

"నీ ఎనకమాల ఇద్దరు పిల్లలు వున్నారు. వాళ్ళ బాగోగులు కూడా మేం చూసుకోవాలిగా? అలోచించుకో నాయనా.....తల్లీ.....బంగారం.....నీ మంచికే!? అన్నాడు నాన్న బతిమాలుతూ.

రాత్రి పడుకున్న రమాదేవికి నిద్ర రాలేదు. ఒకటే ఆలోచనలు! అమ్మ నాన్నలిద్దరూ గట్టి పట్టుదలతో వున్నారు పెళ్ళి చేయాలని.

చేసుకోవాలా, వద్దా అని తేల్చుకోలేకపోతుంది. సతమతమైపోతోంది. అర్థం గాకుండా వుంది!

హఠాత్తుగా కమలమ్మ టీచర్ గుర్తుకు వచ్చింది. ఆమె తనకి ఐదో తరగతి టీచర్.

ప్రతి ఒక్కరు బాగా చదువుకోవాలనీ, చదువుకుంటేనే మంచి బతుకు ఉంటుందనీ ఆమె రోజూ చెప్పేది. ఈ కాలంలో ఆడవాళ్ళకి తప్పనిసరిగా చదువుండాలని ఆమె పదేపదే చెప్పేది.

చాలా మంచి మనిషి ఆమె. మంచి మనిషే కాదు. మంచి మాటలు ఎన్నో చెప్పేది. ఆమె మనసు సున్నితం. మా వాడలో చిన్న పిల్లలకి తరచుగా పెళ్ళిళ్ళు జరుగుతుంటే బాధపడేది. కన్నీరు పెట్టుకునేది.

చిన్న పిల్లలకి పెద్దవాళ్ళు పెళ్ళిళ్ళు చేయకూడదనీ, పిల్లల పెళ్ళిళ్ళు చాలా అనర్థమనీ ఆమె ఎంతో వేదనతో చెప్పేది.

ఐదులో తను ఫస్ట్ వస్తే తనకి మంచి డ్రస్ కొనిపెట్టింది. ఎంత బాగుందో ఆ డ్రెస్.

ఆమె తన ఆరాధ్య దైవం! రోల్ మోడల్! పెద్దయితే ఆమె మాదిరిగా వుండాలని ఆమె కోరిక.

మంచి నూలు చీర కట్టుకుని, కళ్ళ జోడు పెట్టుకుని, భుజానికి బ్యాగ్ తగిలించుకుని ఎంత బాగుండేదో ఆమె! తను కూడా అలా వుండాలనుకునేది!

చదువులేకపోతే ఏముంది? ఎదురింటి రత్న పరిస్థితే!

ఇప్పుడు అందరూ రత్తి అంటున్నారు. తన ఈడే! తన సాహసగత్తే! బొమ్మలాట, కుందుళ్ళు ఆట, బచ్చాలాట, గవ్వలాట, గన్నీలాట తనతో కలిసి ఆడుకున్నదే!

పెళ్ళిఅయ్యింది. మేనమామనే చేసుకున్నది. వాడు రోజూ తాగివచ్చి తన్నడమే!

అసలే బలహీనురాలు! చిన్నవయసు. నెలలు. ఇప్పుడు ఎండిపోయి, చిక్కిపోయి, వక్కిపోయి బక్కమ్మ అయింది.

రేపు తన పరిస్థితీ అంతే కావచ్చు. పెళ్లయ్యి, పోయి పొయ్యికాడ కొంపలో అందరికీ నుండి వార్చి తగలబడాల్సిందే!

తమ వాడలో ఎంత మందిని చూడలేదు. తన కంటే చిన్న పిల్లలు! ఇవ్వాళ ముసలమ్మల ఆవతారం ఎత్తారు.

ఈ చెడ్డ ఆచారానికి అడ్డుకట్టపడాలి! అందుకు తానే తొలి అడుగువేయాలి.

స్పష్టత వచ్చింది. అప్పుడే పెళ్ళి చేసుకోకూడదని దృఢంగా నిర్ణయించుకుంది రమాదేవి.

మరుసటి రోజు నిద్రలేవడమే ఆలస్యం... అమ్మానాన్న ఇద్దరూ మొదలుపెట్టారు పాఠం!

ఆ రోజు మొదలు...

రోజు తగాదే, ఘర్షణే! వాళ్ళు పెళ్ళి చేసుకొమ్మనీ, తను వద్దనీ!

ఇంతలో ఒక రోజు చిన్నత్త దిగింది.

"ఏమే మేనకోడలా... బాగున్నావా?"

" ఇప్పటికీ బాగున్నాను అత్తా... ఇక ముందు నీ దయ!"

" నా దయ ఏముందే? నేను నీ మంచి కోరేదాన్నే కదే!"

" ఏమో.. నువ్వు కోరే మంచి, నీకు మంచి అవుతుందేమో కానీ, నాకు మంచి కావాలని ఏముంది?"

"మాటలు బాగా నేర్చావే! ఇంతకీ పప్పుకూడ పెడతన్నావా, లేదా?"

"ఎందుకు పెట్టను అత్తా? ఇయ్యాల అమ్మ పప్పేవండింది. కాళ్ళు కడుక్కుని వచ్చి కూర్చో.. పెడతాను!"

"ఇంట్లో పప్పు కూడు కాదే! పెళ్ళి పప్పుకూడు!

"పెళ్ళి చేసుకునేటప్పుడు పెట్టకుండా ఎలా వుంటాను అత్తా?" నీళ్ళకి వెళ్ళిన అమ్మ వచ్చింది. నాన్న కూడా వచ్చాడు.

అత్త ఎందుకు వచ్చిందో రమాదేవికీ తెలుసు. ఇంట్లో వుండటానికి ఇష్టపడలే,



ఎదురు గుడిసె రత్న దగ్గరికి వెళ్ళింది.

ఇంట్లో వున్న ముగ్గురూ చాలాసేపు మాట్లాడుకున్నారు.

సాయంత్రానికి రమాదేవి చెరుకుగానే తిరిగి వచ్చింది.

"అబ్బాయి వాళ్ళు చూసి పోవడానికి రేపు సోమవారం వస్తారమ్మాయి! నువ్వు చేసుకోకతప్పదు. ఇప్పుడు కాకపోతే ఇక ముందు కాలంలో మేం పెళ్ళి చేయలేం. మా వల్ల కాదు. నువ్వు కాదంటే కట్టేసి అయినా మెళ్ళో మూడు ముళ్ళు వేయిస్తాం. నీ ఇష్టం పెళ్ళి కాబట్టి సంతోషంగా వుంటేనే నీకు మాకూ అందరికీ బాగుండిద్ది!" అన్నాడు నాన్న.

" చూడమ్మ... నువ్వయినా నాన్నకి చెప్పమ్మా! నేను ఇప్పుడు చేసుకోను!"

"ఇంక ఎప్పుడు చేసుకుంటావే! ఏళ్ళు ముదిరిన ముసిల్దానివి అయిన తరువాత చేసుకుంటావే ఏంది? పిచ్చి వేషాలు వేయకు మనం కావాలనుకున్నప్పుడు మంచి సమ్మంధం రమ్మంటే వచ్చిద్దీ?" అంది అమ్మ.

సోమవారం వాళ్ళు వచ్చారు. చూశారు. నచ్చింది అమ్మాయి. "ఇయ్యాల మంచిరోజు. లగ్గాలు ఇయ్యాలే పెట్టుకుందాం!" అన్నాడు వరుడు తండ్రి. ఊళ్ళో బాపన పంతుల దగ్గరకి వెళ్ళి, వాయనం సమర్పించి, లగ్నపత్రిక రాయించుకుని వచ్చారు. రమాదేవి పెళ్ళి ఘడియ నిశ్చయమైపోయింది. బడి మానిపించారు. రమాదేవి ధ్యాసంతా చదువు మీద వుంది. ఆటల మీద వుంది. స్కూల్లోని స్నేహితుల మీద వుంది. నాన్న ఊళ్లో ఆసాముల దగ్గరకి వెళ్ళి డబ్బు అప్పుగా తీసుకువచ్చాడు. పెళ్ళి విందుకి, చిల్లరకొట్టు శెట్టి దగ్గర సరుకులు తీసుకువచ్చారు. గుడిసెకి సున్నం పూశారు. గుడిసె లోపలా, బయటా అలకడం, ముగ్గులు వేయడంలాంటి పనులు చేశారు. బంధువులకి కబుర్లుపోయాయి. పెళ్ళి పనులు హడావుడిగా జరుగుతున్నాయి. రమాదేవి నిర్ణయంలో మార్పులేదు. ఎలాంటి పరిస్థితిలోనూ పెళ్ళి చేసుకోకూడదు. "నేను చావనైనా చస్తాను కానీ, ఈ పెళ్ళి చేసుకోను!" చెప్పింది అమ్మానాన్నకి. "చావు. నువ్వు చస్తానంటే ఎవరు వద్దంటారు? మాకే పీడా వదిలిపోయిద్ది! చచ్చిద్ది అంటనే! చావు మరి! చచ్చి ఏం సాధిస్తా! ఎవుర్ని బెదిరిస్తా? పెద్దోళ్ళ మాట వినకుండా ఎదురుతిరిగే దానిని చస్తే మాత్రం ఏం? ఇంక రెండ్రోజుల్లో పెళ్ళి పెట్టుకుని చచ్చిద్ది అంటనే! చావు మరి! చచ్చి ఏం సాధిస్తా? ఎవుర్ని బెదిరస్తా? పెద్దోళ్ళ మాట వినకుండా ఎదురుతిరిగే దానిని చస్తే మాత్రం ఏం? ఇంక రెండ్రోజుల్లో పెళ్ళి పెట్టుకుని చచ్చిద్ది అంటనే! చావుమరి!" అన్నారు అమ్మానాన్న ఇద్దరూనూ. రమాదేవి ఏడ్చింది. మొత్తుకుంది. అమ్మనీ నాన్ననీ తిట్టింది. అత్తని తిట్టింది. మగపెళ్ళి వాళ్ళని తిట్టింది. నానారభాస చేసింది. ఉపయోగం లేకపోయింది. పెళ్ళి రేపే. ఊళ్ళో పోలీస్‌స్టేషన్ వుంది. ఏది అయితే అది అవుతుందని, షాప్‌కి అని చెప్పి, స్టేషన్‌కి వెళ్ళింది. రమాదేవి వెళ్ళిన సమయానికే ఎస్.ఐ వున్నాడు. నేరుగా ఆయన దగ్గరకి వెళ్ళింది. "ఎవరమ్మాయివి నువ్వు? ఏం కావాలి? ఎవరు కావాలి?" ఎస్.ఐ అడిగాడు. "నా పేరు రమాదేవండీ! హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. చదువంటే నాకు బాగా ఇష్టమండీ! మా నాన్న స్కూల్ మానిపించి పెళ్ళి చేస్తున్నారండీ! నాకు పెళ్ళి అసలు ఇష్టం లేదండి! రేపేనండీ పెళ్ళి! నేను చదువుకుంటానండీ!" ఏడుస్తూ చెప్పింది. రమాదేవికి సంబంధించిన మొత్తం వివరాలు తెలుసుకున్నాడు ఎస్.ఐ. "సరేనమ్మా! నీ పెళ్ళి జరగదు. నువ్వు భయపడాల్సిన పని లేదు. నిశ్చింతగా వుండు. ప్రశాంతంగా, హాయిగా వుండు. మాకు చెప్పి మంచి పని చేశావు. నీకు అండగా నేను ఉన్నా! ఇంటికి వెళ్ళు. నువ్వు ఇక్కడికి వచ్చిన విషయం మాత్రం ఎవరికీ చెప్పకు!" అన్నాడు ఎస్.ఐ. రమాదేవి ఇంటికి వచ్చింది. రోజు గడిచింది. రాత్రికి పెళ్ళి బంధువులు వచ్చారు. పెళ్ళి పనుల్లోనూ, భోజనాలు ఏర్పాటులోనూ అందరూ ఉన్నారు. మహావేగంతో వచ్చిన పోలీస్ జీప్ ఇంటి ముందు ఆగింది. పోలీసులు ఎందుకు వచ్చారో వాళ్ళకి అర్థం కాలేదు. అయోమయంగా జీప్ దగ్గరకి వచ్చారు.

"ఎవరి పెళ్ళిరా ఇది?" జీప్ దిగుతూనే అడిగాడు ఎస్.ఐ.

"మా కూతురు పెళ్ళండీ!" భయపడుతూ చెప్పాడు పెళ్ళి కూతురు తండ్రి.

"అమ్మాయిని తీసుకురండి!"

రమాదేవిని ఎస్.ఐ ఎదుటికి తీసుకువచ్చారు.

"ఎన్నేళ్ళు ఈ పిల్లకి?"

"పదిహేనేళ్ళు సార్!"

"ఎన్నో తరగతి చదువుతోంది?"

"తొమ్మిదినే"

"పదిహేను ఏళ్ళ పిల్లకి పెళ్ళా? ఆడపిల్లకి పెళ్ళి చేయాలంటే 18 ఏళ్ళు నిండి వుండాలి. ఈలోపు వయసులో పెళ్ళి చేస్తే, చేసిన వాళ్ళకి లక్ష రూపాయలు జరిమానా, రెండేళ్ళు జైలూ అని చట్టం వుంది. అమ్మాయి స్కూల్‌కి పోతోంది కదా! చదివించండి ముందు. తరువాతనే చేయండి పెళ్ళి! ముందు పెళ్ళి ఆపండి?"

"సార్సార్ సార్... శుభకార్యం సార్! ఆపకండి సార్. మీకాళ్ళు పట్టుకుంటాం సార్!"

"శుభకార్యం కాదు, బలికార్యం! ముందు పెళ్ళి ఆపండి!"

"సార్...సార్..." వంగి కాళ్ళు పట్టుకున్నాడు రమాదేవి నాన్న.

"ఏం రా... నవ్వులాటగా ఉందా? నా సంగతి తెలీదు. పెళ్ళి కొడుకునీ, మిమ్మల్నీ డొక్క చింపి, మక్కెలిరక్కొట్టి బొక్కలో నూకి చిప్పకూడు తినిపిస్తా!"

" అది కాదు సార్!"

"నాతో ఎక్కువ మాటలు కాదు. లక్ష రూపాయలు పెనాల్టీ కట్టి, రెండేళ్ళు జైలు చేయండి. ముందు పిల్ల అమ్మనీ, నాన్ననీ జీప్ ఎక్కించండి. లాకప్‌లో తోసి నాలుగు ఉతికితే వాళ్ళే దారికి వస్తారు!" పోలీసులకి చెప్పాడు ఎస్.ఐ. ఫోన్ మీద మగపెళ్ళి వాళ్ళకి కబురు వెళ్ళిపోయింది. పెళ్ళి ఆగిపోయింది.

ఇది జరిగి ఐదేళ్ళు అవుతోంది. తరువాత రమాదేవి టెన్త్, ఇంటర్ పూర్తిచేసి, టీటీసీలో చేరింది. టీటీసీ చివరి పరీక్షల సమయంలోనే డిఎస్సీ పడింది. రాసింది. మంచి మార్కులతో, మంచి ర్యాంక్‌తో, రిజర్వేషన్ సాయంతో దగ్గరలోనే వున్న స్కూల్లో టీచర్‌గా జాయిన్ అయ్యింది. అమ్మా నాన్న ఆనందానికి అవధులే లేవు. "అబ్బాయిని చూడండి నాన్నా! పెళ్ళి చేసుకుంటాను". "చూస్తాం అమ్మా! మన అన్నారు. కొంచెం గర్వంతోనూ, ధీమాతోనూ. తరువాత, అమ్మానాన్న ఇద్దరూ రమాదేవికి వరుడ్ని వెతికే పనిలో పడ్డారు.

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థి తుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరు నామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరు నామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

సమాజాన్ని ప్రశ్నించిన కవితలు

అభిలాశ అనే కలం పేరున్న జాని బాషాచరణ్ తక్కెడశిల రచించిన విప్లవ సూర్యుడు కవితా సంపుటి నియంతలపై దోపిడీ రాజ్యంపై ఎక్కుపెట్టిన బాణం. 'ప్రభంజనం' అనే కవితలో దొంగలరాజ్యం! దోపిడీల రాజ్యం! ధర్మంలేని రాజ్యం! దయలేని రాజ్యం! అని దుష్ట రాజ్యం పోకడను ఎండగడతారు. కవి సమసమాజం కోసం కలలు కంటారు. అవినీతితో కుళ్ళిపోతున్న సమాజం, దగా పడుతున్న దళితుడు, కష్టపడి పనిచేసే కార్మికుడు, విచక్షణా జ్ఞానం లేకుండా ప్రపంచం మీద దాడి చేస్తున్న ఉగ్రవాదం, కుల మత ద్వేషాలు, మత్తులో మునుగుతున్న యువతరం ఇవన్నీ కవికి కవితా వస్తువులే.

'దళిత ఖడ్గం' కవితలో 'అక్షరాస్యతతో నీ అంధకారాన్ని తొలగించు' అని దళితుడు చీకట్లో మునిగి పోవడానికి కారణం నిరక్ష్యరాస్యతేనని ఎలుగెత్తి చాటుతారు కవి. కార్మిక జన పక్షపాతి 'కార్మికుడా' కవితలో 'వెన్నెముక విరుచుకొని నీ వెన్నెముక వంచకురా! ఇకనైనా మార్చుకో నీ తలరాత! లేకుంటే నీవు బ్రతికి ప్రయోజనమేమి?' బాహువుల నిండా బలమున్న నీకు బానిస బతుకుయేలరా? అని ప్రబోధిస్తారు. నేటి బాలలే రేపటి పౌరులు అంటారు. బంగారు బాల్యం అని అభివర్ణిస్తారు. కానీ అందమైన బాల్యం, ఆనందాల బాల్యం కొందరికే సొంతం. చాలా మంది పిల్లలు అనాధలు రోడ్ల మీద చెత్తకుప్పల్లో చిత్తుకాగితాలేరుకొనే వారు. హోటళ్లలో కప్పులు కడిగేవారు, ఫ్యాక్టరీలలో పనులు చేసేవారు, హైవే మెట్ల మీద పడుకునేవారు, షాపుల అరుగుల మీద పడుకునే అభాగ్యులు మనకి కనిపిస్తూనే వుంటారు. నిత్య జీవితంలో 'భావిపౌరులు' అనే కవితలో 'అదిగో అదిగో/చెత్తకుప్పలలో భావిపౌరులు/ విస్తరాకులలో విందు/ ఎవరు చేసిన దోషము అని సమాజాన్ని ప్రశ్నిస్తారు. 'యువ'లో లేలేలే భారత్ యువ పౌరుడా? అంటూ "వీడు వీడు సోమరితనపు మత్తు వీడు, మద్యం మత్తులో ఊగిసలాడకు" అంటారు.

కవిత్వం రాయాలనే తపన గల జాని గారి కవితా సంపుటిలో చాలా కవితల్లో శ్రీశ్రీ ప్రభావం కనిపిస్తుంది. ఏ కవిపైనైనా పూర్వ కవుల ప్రభావం కొద్దోగొప్పో వుంటుంది. ఆ ప్రభావాన్ని తప్పించుకుని స్వీయముద్ర సాధన చేసి భవిష్యత్తులో మరిన్ని కవితా సంపుటాలను వెలువరిస్తారని ఆశిస్తున్నా.

పుస్తకం పేరు : విప్లవ సూర్యుడు
పుటలు :104,
వెల : రు.100/-
ప్రతులకు : జానీ బాషాచరణ్ తక్కెడశిల, ఇంటి నెం. 3-4-173-ఎ, శివాలయం వీధి పులివెందుల, వై.ఎస్.ఆర్ కడప- 516390



-మందరపు హైమావతి

పైలెట్ కుటుంబం

విమానం ఎక్కడం చాలా మందికి చిన్ననాటి జ్ఞాపకంగానో, కలగానో వుంటుంది. అలాంటిది విమానాన్ని నడిపే అవకాశం వస్తే ఇక ఆ ఆనందానికి అవధులుండవేమో.... ఢిల్లీకి చెందిన జయదేవ్ భాసిన్ కూడా చిన్నతనంలోనే పైలట్ అవ్వాలనుకున్నాడు. 1954లో పైలట్‌గా మారి తన కల నిజం చేసుకున్నడు. తను వివాహం చేసుకున్నది కూడా ఒక పైలట్‌నే. 20 ఏళ్ళకే పైలట్‌గా బాధ్యతలు తీసుకుంది భార్య నివేదిత. అతిపిన్న మహిళా కెప్టెన్‌గా పేరుతెచ్చుకున్నారామె. ఎయిర్ బస్ -300 కమాండర్‌గా, పూర్తి మహిళా సిబ్బందితో ప్రారంభమైన మొట్టమొదటి బోయింగ్ -737కి కో- పైలట్‌గా వ్యవహరించారు. వీళ్ళ కొడుకు రోహన్ కూడా తన కెరీర్‌ని పైలట్ దిశగానే ఎంచుకున్నాడు. పైలట్ కమాండర్‌గా ఉద్యోగం తెచ్చుకున్నాడు రోహన్. తన తండ్రి జయదేవ్‌తో కలిసి పనిచేయాలనుకున్న రోహన్‌కి బోయింగ్ 786 ద్వారా దాదాపు పదిసార్లు తండ్రితో కలిసి పనిచేసే అవకాశం దక్కింది. ఇలాంటి వన్నీ రోహన్‌కి మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. ఇక్కడ ఆశ్చర్యపరిచే విషయం ఏంటంటే రోహన్ కూడా పైలట్‌గా పనిచేస్తున్న అమ్మాయినే పెళ్ళిచేసుకోవడం. ప్రస్తుతం రోహన్ బోయింగ్ 777 కమాండర్‌గా పనిచేస్తున్నారు. తన భార్య నిహారిక ఎయిర్‌బస్ ఎ320కి కమాండర్. జయదేవ్ భాసిన్ తండ్రితో కలిపి మొత్తం ఆ కుటుంబంలో ఐదురుగురు పైలట్‌లుగానే స్థిరపడ్డారు. అలా బాసిన్ కుటుంబం పైలట్ ప్రస్థానం వందేళ్ళు పూర్తిచేసుకుంది. దీర్ఘకాలం పైలట్‌లుగా కొనసాగటంతోపాటు ఒకే కుటుంబానికి చెందినవారు ఎయిర్ వేస్‌లో పనిచేయడం అదీ పైలట్‌లుగా వుండడంతో అందరూ 'పైలట్ కుటుంబం'గా వీళ్లని పిలిచేసుకునేవారు. అంతేకాదు భారతదేశపు మొట్టమొదటి 'ఫ్లయింగ్ ఫ్యామిలి'గా కూడా బాసిన్ కుటుంబం గుర్తించబడింది. ★



ఊహాన్విత వాస్తవం

ఊహ, వాస్తవం లీలగా కలిస్తే అదే 'సర్రియలిజమ్'. ఆధునిక కళాత్మక సృజనగా కితాబు పొందిన ఈ ఎఫెక్ట్ ఓ చిత్రంలో రావాలంటే కుంచె కదలికలోనే కాదు రంగుల మేళవింపులోను ఏదో కనికట్టు తెలియాలి. రంగులు అక్కరే రాకుండా నలుపు-తెలుపుల్లో ఈ విశేషానికి పటం కడుతున్నాడు జోనో డ్రై. దక్షిణాఫ్రికాకు చెందిన ఈ కుర్ర కళాకారుడు కేవలం 'సర్రియలిజమ్' కాదు దానికి 'హైపర్ రియలిజమ్'ను కూడా మిమిక్ చేసి హద్దులు లేని ఊహల్లోకి చిత్ర కళను నెట్టేస్తున్నాడు. అది కూడా కేవలం పెన్సిల్ చేతపట్టి. ఇతడి చిత్రాల్లోని ఫొటోగ్రాఫిక్ నాణ్యత, కాన్సెప్ట్, కంపోజిషన్‌లే ట్రిక్కంతా చేస్తున్నాయి. చిత్ర కళకు గానీ, ఆర్కిటెక్చర్‌కు గానీ, ఫొటోగ్రఫీకి కానీ ఎంతో కీలకమైన 'గోల్డెన్ రేషియో' పొందికని ఇతడి చిత్రాల్లో చూడొచ్చు. వీటిని చూస్తే ఓ సాధారణ పెన్సిల్‌తో ఇంత స్పష్టమైన ముఖచిత్రాలను గీయొచ్చా..! అలల్ని సృజించొచ్చా..! అని సంభ్రమంలో పడిపోతాం. అరచేతిలో వేళ్లూనుకునే వృక్షం, కంటిలో దాగే ప్రయత్నం చేసే మనిషి, ఉన్న చోటే ఎగసి పడే నీరు..! ఇవన్నీ కూడా నిజంలానే అనిపించే ఊహాతీత ప్రతీకాత్మక చిత్రాలు. ఒక్కో చిత్రానికి రెండు వారాల నుంచి 5 నెలలు సమయాన్ని వెచ్చించి గీసే జోనో కళకు ఖరీదు కట్టలేం. ఏడాదికి 4-8 కళా ఖండాల్ని సృజించే జోనో తన ఆలోచనలకు ప్రాణం పోసుకుంటే... అర్థవంతమైన వ్యాసంగంలో తన సృజన ఊపిరితీసుకుంటే చాలు అనుకుంటున్నాడు. ఎన్ని పటాలు కట్టాము.. ఎంత డబ్బు పోగేసుకున్నామనే రికార్డుల లెక్కల జోలికి వెళ్లడం లేదు. ఈ ఒక్క విషయం చాలు, అతడి జీవనశైలి కూడా కాసింత హైపర్‌రియలిస్టిక్‌గానే ఉందనటానికి తోస్తోంది. అతడి దీక్ష సర్రియల్‌గానే అనిపిస్తోంది. ★













వివరం

అట్టపాడి కేరళలోని ఒక చిన్న పల్లెటూరు. అక్కడే ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగేవారు విజయలక్ష్మి, గోపాలకృష్ణన్ దంపతులు. అందరిలా వాళ్ళు తమ పిల్లలను సాధారణ బడిచదువులకు పరిమితం చేయలేదు. ఎత్తైన ఆ కొండ ప్రాంతంలో అడవి నాటడంతోపాటు తమ పిల్లల బతుకుతెరువుకి కావాల్సిన పాఠాలను ప్రకృతి నుంచే నేర్చుకునేలా చేశారు. అలా ముప్ఫైయేళ్ళుగా ప్రకృతి ఒడిలో జీవిస్తున్న ఆ కుటుంబం గురించి మీరూ తెలుసుకోండి.

ప్రకృతి బడి

చదువంటే బ్లాక్‌బోర్డు పాఠాలు బండెడు పుస్తకాలు కాదు. అది పిల్లల్లో విజ్ఞానాన్ని, వివేకాన్ని పెంచేలా వుండాలి. ఎలాంటి సమస్యనైనా పరిష్కరించగల ధైర్యాన్ని పెంపొందించాలి. అలాంటి చదువు కావాలంటే మనం ప్రకృతికి చేరువవ్వాల్సిందే అంటారు గోపాలకృష్ణన్ విజయలక్ష్మి. ఇదంతా ఉపాధ్యాయులుగా కొనసాగిన ఆ ఇద్దరు అనుభవంలో నేర్చుకున్నదే. బడిచదువుకంటే ప్రకృతి బడిలో నేర్చుకునే వ్యవసాయం, చెట్టుచేమలు, జంతువులు పక్షులతో సావాసాలు మనిషిని మరింత ఉన్నతంగా తయారుచేస్తాయి అనేది వారి ఫిలాసఫి. ఆ ఆలోచనే సారంగ్ బడి మొదలుపెట్టడానికి కీలకమయ్యింది. 1994లో ఓ ప్రభుత్వ బడిలో ఉపాధ్యాయవృత్తిని వదిలిపెట్టారిద్దరూ. ప్రకృతితో మమేకమవ్వాలనే ఆలోచన తప్ప అప్పటికి అలాంటి పరిసరాలేవి అక్కడలేవు. పచ్చని పరిసరాలని ఏర్పరుచుకోవడమే సారంగ్ తొలి కార్యాచరణ అయింది. పాలక్కడ్‌లోని ఎత్తైన ఓ కొండ ప్రాంతం అట్టపాడి. అక్కడి బంజరుభూముల్లో గోపాలకృష్ణన్‌కి చెందిన ఎకరా భూమిలో సారంగ్ బడిని ప్రారంభించారు.

ఈ బడిలో తొలి విద్యార్థి కూడా వాళ్ల కొడుకు గౌతమే. తర్వాత బంధువులు, స్నేహితులు కూడా వాళ్ళ పిల్లల్ని ఈ బడిలో చేర్చేందుకు ముందుకొచ్చారు. అంతే కాదు పేదరికంతో బడిచదువుకి దూరమైన చిన్నారులకి బాసటగా నిలిచింది సారంగ్. అయితే అప్పటికే నీటి వనరులు లేక పూర్తిగా ఎండిపోయింది ఆ ప్రాంతం. అలాంటి నేలని చదును చేయడంతోపాటు మొక్కలను పెంచే పనులు మొదలయ్యాయి. మనం సాధారణ తరగతి గదుల్లో చూసే బ్లాక్‌బోర్డ్, కుర్చీలు, బల్లలు ఏవీ ఇక్కడ వుండవు. భూమే పిల్లలకి క్యాన్‌వాస్. కృష్ణన్ కొడుకుతోపాటు బడిలో చేరిన పిల్లలు ఆ ప్రాంతాన్ని బాగుచేసే పనుల్లో సాయపడ్డారు. నేలని చదును చేయడంతోపాటు మొక్కలను నాటి కొద్ది కాలంలోనే అక్కడ ఒక పచ్చని వనాన్ని తయారుచేశారు. అయితే ఇదంతా అంత తేలికగా ఏం జరిగిపోలేదు. ఇలాంటి ఓ పచ్చని బడిని తయారుచేయడానికి కృష్ణన్ దంపతులు ఎన్నో కష్టాలని ఎదుర్కోవాల్సి వచ్చింది.

ఊహించని ఓ పరిణామం

సారంగ్ బడి మొదలు పెట్టిన రెండేళ్ళకే దాదాపు 50 మంది పిల్లలు బడి మానేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో బడినడపడం పూర్తిగా విరమించుకున్నాడు. అయితే తన కుటుంబం మాత్రం అక్కడి నుంచి వెనుదిరగకూడదని నిర్ణయించుకున్నారిద్దరూ. అక్కడ దొరికే మట్టి, గడ్డి, వెదురు కర్రలతో ఓ చక్కటి ఇల్లుకట్టేసుకున్నారు.. ఆ తర్వాత వ్యవసాయానికి సంబంధించిన పనులూ మొదలయ్యాయి. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులనుసరించి పప్పులు, పండ్లు, కాయగూరలను సాగుచేయడం మొదలుపెట్టారు. అలా వ్యవసాయశాస్త్రాన్నీ వంటబట్టించుకున్నాడు గౌతమ్. కృష్ణన్ ఇద్దరు అమ్మాయిలు కన్నకి, ఉన్నిఆర్చ కూడా ఇక్కడే పుట్టారు. అలా తన ముగ్గురు పిల్లలు ప్రకృతి ఒడిలో పెరగడం ఆ దంపతుల్లో ఆనందాన్ని నింపింది. ఇక సారవంతమైన నేలని కాపాడుకునే దిశగా పెద్ద పెద్ద చెట్లని పెంచడం మొదలు పెట్టారు. ఇలా పదిహేనేళ్ళలో ఆ ప్రాంతమంతా పచ్చటి వృక్షాలతో ఒక అడవిగా మారింది. ఎన్నో రకాల పక్షులు, జంతువులతో జీవవైవిధ్యానికి వేదికైంది. నీటి కొరతని తీర్చేందుకు నీటిగుంతల తవ్వకాలతోపాటు చెక్‌డ్యామ్‌లు వాటర్ షెడ్‌లని నిర్మాణాలన్నింటినీ కృష్ణన్ కుటుంబమే పూర్తిచేసింది. దట్టమైన ఓ అడవిని తయారు చేయడం కంటే అక్కడ అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడడం ఒక దశలో వీరికి సమస్యగా మారింది. కిత్తలి మొక్కల్ని పెంచడం ద్వారా ఆ సమస్యకి పరిష్కారాన్ని కనిపెట్టారు. ఇలా ప్రతి సారి సమస్యల నుంచే పాఠాలని నేర్చుకోవడం వారి జీవనంలో కీలకమైన విషయం. తర్వాత గౌతమ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకునేందుకు మరో ప్రాంతానికి వెళ్ళాడు. అయితే అక్కడ తోటివిద్యార్థులు చిన్న చిన్న విషయాలకే వత్తిడికి లోనయ్యేవారు. ఇలాంటి వన్నీ గౌతమ్‌ని ఆశ్చర్యపరిచేవి. నిజానికి అలాంటి ధైర్యాన్ని నింపింది ఆ ప్రకృతి బడే అంటాడు గౌతమ్. గౌతమ్‌లానే ఇప్పుడు తన కొడుకు కూడా సారంగ్ బడిలో పాఠాలు నేర్చుకుంటున్నాడు. ★



ఓట్స్ స్లైస్

కావాల్సిన పదార్థాలు

ఓట్స్-500గ్రాములు
బెల్లం-300 గ్రా
బాదం పప్పులు-20
పిస్తా పప్పులు-15
నువ్వులు-1/4 కప్పు
పల్లీలు-1/4 కప్పు
జీడిపప్పు పలుకులు-1/4 కప్పు
నెయ్యి- 1/4 కప్పు

తయారుచేసే విధానం

ఓట్స్, బాదం పప్పులు, పిస్తా, పల్లీలు, నువ్వులు, జీడిపప్పుల్ని విడివిడిగా వేగించుకుని పక్కన పెట్టుకోవాలి. పొయ్యి మీద మందపాటి పాత్ర వుంచి అందులో నెయ్యివేసి వేడెక్కనివ్వాలి. అందులో బెల్లం, కొద్దిగా నీళ్ళు పోసి పాకం వచ్చే వరకూ మరిగించి దించేయాలి. ఇందులో వేయించి పెట్టుకున్న ఓట్స్ మిగిలిన పప్పుల్ని వేసి బాగా కలపాలి. ఒక పళ్ళానికి నెయ్యిరాసి అందులో ఈ మిశ్రమాన్ని వేసి చల్లారనివ్వాలి. తర్వాత మనకి నచ్చిన సైజులో ముక్కల్ని కట్ చేసుకోవాలి.

ఓట్స్ టిక్కీ

కావాల్సిన వస్తువులు

ఓట్స్-1 కప్పు
ఉడికించిన బంగాళా దుంపలు-2
పనీర్-పావుకప్పు
కారం-చెంచా
కొత్తిమీర తరుగు-1 కట్ట
క్యారెట్ తరుగు-1 కప్పు
మొక్కజొన్న పిండి-2 టేబుల్ స్పూన్లు
ఉప్పు-తగినంత
నూనె-1/4 కప్పు
బ్రెడ్‌పొడి-1/2 కప్పు



తయారుచేసే విధానం

ముందుగా నూనె కాకుండా మిగిలిన పదార్థాలన్నింటినీ ఒక బౌల్‌లోకి తీసుకోవాలి. అందులో కొద్ది కొద్దిగా నీరు చేర్చి ఈ పదార్థాలన్నిటినీ కలిపి టిక్కీల్లా చేసుకోవాలి. వీటిని ముందుగా మొక్కజొన్న పిండిలో తర్వాత బ్రెడ్‌పొడిలో దొర్లించి ఒక ప్లేట్‌లో ఉంచాలి. ఇప్పుడు స్టౌ వెలిగించి పెనం పెట్టి వేడెక్కిన తర్వాత పిండిలో అద్దిన టిక్కీలని ఒక్కొక్కటినీ నూనె వేసి కాల్చుకోవాలి. వేడి వేడి ఓట్స్ టిక్కీలని సాస్‌లేదా చట్నీతో టేస్ట్ చేయండి.

ఓట్స్ మినీ బర్గర్

కావాల్సిన పదార్థాలు

చిన్న బన్నులు-4
ఓట్స్-1కప్పు
బంగాళా దుంపలు-2
చీజ్-1/4కప్పు
పచ్చిమిర్చి-2
మిరియాల పొడి-చిటికెడు
ఉల్లిపాయ-1
గరంమసాలా పొడి-1/2 టేబుల్ స్పూన్
టమాటా-1
నూనె-తగినంత

తయారుచేసే విధానం

ముందుగా బంగాళాదుంపలను మెత్తగా ఉడికించుకోవాలి. ఒక బౌల్‌లో కప్పుడు నీళ్ళు మరిగించిన ఓట్స్ వేసి 10 నిమిషాలు నాననివ్వాలి. ఒక గిన్నెలో ఉడికించిన బంగాళాదుంపలు చెక్కుతీసి పొడిపొడిగా చేసుకోవాలి. నానిన ఓట్స్ నుంచి నీరు పిండేయాలి. తర్వాత సన్నగా తరిగిన పచ్చిమిర్చి తగినంత ఉప్పు, మిరియాల పొడి, గరం మసాలా పొడి, సన్నగా తరిగిన ఉల్లిపాయలు కొన్ని వేసి ముద్దలా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఉండలుగా చేసుకుని వెడల్పుగా చేసి వేడి పెనం మీద కొద్దిగా నూనె వేస్తూ ఎర్రగా టిక్కీలా కాల్చుకోవాలి. బన్నుని మధ్యలోకి సగంలో కోసి ఒక వరుసలో సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, టమాటా ముక్కలు పెట్టి దానిపై ఈ టిక్కీ పెట్టి పైన చీజ్ తురుము వేసి ఇంకో బన్ను ముక్క పెట్టి కొద్దిగా వత్తాలి దానినిఓవెన్‌లో గానీ లేదా పెనంపైగానీ వుంచి చిన్న మంటపై చీజ్ కరిగే వరకు వేడిచేయాలి. అంతే..! పిల్లలు ఇష్టంగా తినే మినీ బర్గర్ రెడీ!

బాల నేస్తాలు

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనొక స్టార్‌ని! ఈ ఫొటోలో మధ్యన ఉన్నది నేనే. ఇది నా చిన్ననాటి ఫొటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: రకుల్ ప్రీత్ సింగ్

చుక్కలు కలపండి



లెక్కించండి

ఇక్కడున్న వృత్తంలో ఒక వరుసని అనుసరించి కొన్ని అంకెల్ని వుంచాం. అయితే ఇందులో ఒకచోట ఒక అంకె మిస్సయింది. అదేంటో కనిపెట్టి అక్కడ రాసేయండి!



దారి కనుక్కోండి

ఇక్కడున్న జంతువలన్నీ బస్తీలోని సంతను చూసేందుకు బయల్దేరాయి. బస్తీకి వెళ్ళాలంటే మరి పడవెక్కాలి కదా...... గజిబిజిగాఉన్న ఈ దారిలో పడవ దగ్గరికి ఎలా వెళ్ళాలో తెలీడంలేదు. ఆ దారిని మీరే కనిపెట్టండి.



ఏ నీడ ఎవరిది ?

పిల్లలూ! ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి ఎదురుగా కొన్ని నీడలు ఉన్నాయి. అయితే మీరు చేయాల్సింది ఏంటంటే ఏ బొమ్మ నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి.





అతికిద్దాం

చింటూకి ఈ మధ్య మరీ అల్లరి ఎక్కువైపోయింది. ఇక్కడ ఒక పిల్లి బొమ్మని కత్తిరించి అతికించకుండా వెళ్ళిపోయాడు. పైనున్న బొమ్మ ఆధారంగా మీరు దాన్ని జాగ్రత్తగా అతికించేయండే!



తేడాలు గుర్తిద్దాం

ఈ రెండు బొమ్మల్లో మొత్తం పది తేడాలున్నాయి. వాటిని గుర్తించి పెన్‌తో సున్నా చుట్టేయండి.

కుందేలు బొమ్మ చేసేద్దాం!





పిల్లలూ మీకు బొమ్మలు చేయడం అంటే భలే ఇష్టం కదా! ఇప్పటికే మీరు రకరకాల బొమ్మల్ని తయారుచేసుంటారు. అయితే మనింట్లో దొరికే వస్తువులతో కుందేలు బొమ్మని ఎలా తయారు చేసుకోవచ్చో మేం నేర్పిస్తాం. జాగ్రత్తగా మీరూ ప్రయత్నించండే....

కావాల్సిన వస్తువులు

పైప్ క్లీనర్‌లు–4(గులాబి, తెలుపు రంగుల్లో), పామ్‌పామ్ (మీడియం సైజ్)–1, గూగుల్ ఐస్/ గుండీలు–3, పామ్‌పామ్ చిన్నది–1, కత్తెర, గమ్, స్కెచ్ పెన్.

తయారుచేసే విధానం

ముందుగా తెలుపు రంగు పైప్ క్లీనర్‌ని తీసుకుని మీ వేలికి చుట్టి ఒక స్ప్రింగ్‌లా వచ్చేలా చేయాలి. తరువాత ఒక్కో సర్కిల్‌ని గమ్‌తో జాగ్రత్తగా అతికించి పది నిమిషాలు ఆరనివ్వాలి. ఇప్పుడు గులాబి రంగు పైప్ క్లీనర్‌లని తీసుకుని నాలుగు సమాన భాగాలుగా కత్తిరించాలి. వాటిలో రెండు పైప్‌క్లీనర్లని తీసుకుని సమానంగా వచ్చేలా మధ్యకు మడిచి చివర్లని గమ్‌తో అతికించుకోవాలి. ఇప్పుడు ముందుగా అతికించి పెట్టుకున్న పైప్‌క్లీనర్ రోల్ అడుగు భాగంలో చివర్లని అతికించిన పైప్ క్లీనర్స్ రెండింటినీ అతికించాలి. తెలుపు రంగు పామ్‌పామ్(మీడియం సైజ్)ని తీసుకుని రోల్‌పై భాగంలో అతికించుకోవాలి. ఇప్పుడు గూగుల్ ఐస్/ గుండీలని తీసుకుని బొమ్మలో చూపిన విధంగా కుందేలు కళ్ళు, ముక్కు భాగాల్లో అతికించుకోవాలి. ఇప్పుడు సమానంగా కట్‌చేసి పెట్టుకున్న పైప్ క్లీనర్లని తీసుకుని బొమ్మలో చూపిన విధంగా కుందేలు చెవి భాగంలో అతికించుకోవాలి. చివరిగా పామ్‌పామ్ (చిన్నవి) తీపుకుని తోక భాగంలో అతికిస్తే మీకు ఇష్టమైన కుందేలు బొమ్మ రెడీ! ఇలా మీకు నచ్చి రంగుల్లో వివిధ ఆకారాల్లో కుందులు బొమ్మల్ని తయారు చేసుకోవచ్చు. ★

పదవికాసం 74

కూర్పు : రావెళ్ల

ఆధారాలు

అడ్డం

1. తర్జుమా (4)
3. తలమానికం (4)
7. కోపం (2)
8. వార్తలు తెలిపేది (3)
9. జీతం (2)
12. రవిక (3)
13. బిగ్గరగా (3)
17. ఆచరణ (2)
18. సమానము (3)
19. చెలికత్తె (2)
22. మృదుత్వం (4)
24. మహారాణి కూతురు కుడి నుంచి (4)

1		2			3	4		5
				6				
7			8				9	
		10				11		
	12				13			
14				15				16
17			18				19	
		20				21		
22					23			

నిలువు

1. అంటించు (4)
2. బంధుత్వం (2)
4. మిద్దె (2)
5. స్త్రీ తిరగబడింది (4)
6. కూతురు (3)
10. ఉపగ్రహాన్ని మోసుకెళ్లే వాహనం (3)
11. కన్నవారిల్లు (3)
14. చైతన్యం లేని స్త్రీ (4)
15. తమాషా (3)
16 ఎగతాళి చేయు (3)
20. దిగువ నుంచి స్వరం (2)
21. చేకూరి రామారావే ఇలా (2)

సుడోకు

				4				1
			1		9	4		
				5			6	7
5			9	7				3
9	4			8			2	5
8				2	1			4
2	6			9				
		1	2		7			
7				1				

గతవారం జవాబులు

5	3	4	6	7	8	9	1	2
6	7	2	1	9	5	3	4	8
1	9	8	3	4	2	5	6	7
8	5	9	7	6	1	4	2	3
4	2	6	8	5	3	7	9	1
7	1	3	9	2	4	8	5	6
9	6	1	5	3	7	2	8	4
2	8	7	4	1	9	6	3	5
3	4	5	2	8	6	1	7	9

1 కా	ర	2 డ	వి		3 కా	4 ల	ధ	5 ర్మం
ర్మి		పే		6 ఉ		బ్ధి		మ
7 కు	ట్ర		8 చె	రు	వు		9 ఆ	యా
డు		10 క		కు		11 పి		మా
	12 గు	ళి	క		13 మ	లు	పు	
14 ప		క		15 చ		పు		16 అ
17 రి	చ్చ		18 ధ	రి	త్రి		19 త్రో	వ
ణ		20 దో		త్ర		21		మా
22 తి	క	మ	క		23 పు	రా	త	నం



పేంకులాటలో అక్కడ రాళ్లు పడిపోతే బాగుంటుంది కానీ ఇక్కడ రాళ్లు కూలితే గుండె కలుక్కుమంటుంది. అసలివి ఒకదాని మీద ఒకటి నిలబడతాయా అని ఆశ్చర్యపోయేలా రాతి కట్టడాన్ని నిలబెట్టేస్తేనే ఈ 'రా' రాతి కళలో రాటుదేలినట్టు. 1960ల్లో విప్లవాత్మకమైన 'ల్యాండ్ ఆర్ట్ మూవ్‌మెంట్'కు ఈ రాతి కళ కొనసాగింపు అనుకోవచ్చు. ఈ కళలో మైకేల్ గ్రాబ్‌కి శిలా విగ్రహం కట్టొచ్చు. శిలలతో శిల్పాలు పేర్చేస్తాడు మరి. కెనడాకు చెందిన మైకేల్ 2008లో ఏదో సరదాగా స్నేహితుడితో కలసి కొలరాడోలోని బౌల్డర్ క్రీక్‌కు వెళ్లాడు. అప్పటికే అక్కడ కొందరు ఒక రాయి మీద ఒకటి పేర్చిన ఎన్నో రాతి కట్టడాలున్నాయి. తాను సరదాగానే ఓ రాయి పెట్టాడు.

మైకేల్‌కు ప్రకృతి అంటే పిచ్చి. సముద్ర తీరాల్లో.. దట్టమైన అడవుల్లో మనసు దాచుకోవడానికి మించింది ఏదీ లేదనుకునేవాడు. కానీ ఈ బౌల్డర్ల (రాళ్ల) విన్యాసాలు ఆయన్ను బౌల్డ్ చేసేశాయి. ఓ వేర్‌హౌజ్‌లో పనిచేసేపుడు జీవితం బాగా విసుగ్గా అనిపించేదట. ఇలా రాళ్లను పేరిస్తేనే కాసింత మనసు కుదుటపడేదట. రాళ్ల విన్యాసం చెదరకుండా ఉండేందుకు ఏర్పాటు చేసుకునే 'ట్రైపాడ్' విషయంలోనే కాక గరిమనాభి అంతు చిక్కించుకున్నాడు. స్విట్జర్‌ల్యాండ్, స్వీడెన్, స్కాట్‌ల్యాండ్, జర్మనీ, క్రొయేషియా, ఇటలీ, బెల్జియం, ఫ్రాన్స్‌ల్లోని ప్రకృతి కేంద్రాల్లో ఇలా రాళ్లను పేర్చాడు.థెరెసా జాంజెన్ అనే అమ్మాయి కూడా బౌల్డర్ క్రీక్‌కు ఓసారి సరదాగా వచ్చింది. గంటల తరబడి గడ్డకట్టించే నీటిలో నించొని మైకేల్ కొన్ని రాళ్లను పేర్చడం ఆమెకు పిచ్చితనంగా అనిపించింది. ఆ తర్వాత అతడు సృజించిన అద్భుతాన్ని చూసి ఫ్రెండైపోయింది.

శిలలతో శిల్పాలు పేర్చినాడు...





ఇంకా ఉప్పు



పెరూ అనగానే మనకు 'ఇంకా' నాగరికత ఆనవాలు మాచ్చుపిచ్చూ గుర్తొస్తుంది. పర్వతానికి భారీ మెట్లు వేసినట్టు లోయలోకి దొంతర దొంతరలుగా ఉండే ఓ మహా పట్టణం శకలాలవి. వేల ఏళ్లనాటి ఇంకన్‌ల గురుతులేవి ఇప్పటికీ సజీవంగా లేవా? అని బాధపడక్కర్లేదు. అచ్చు మాచ్చు పిచ్చూ లాంటి అద్భుతాన్ని పెరూలోని ఓ ముఖ్యపట్టణం కుజ్కోకు ఉత్తరాన 40 కి.మీ.ల దూరంలోనున్న మారస్ ఉప్పు కొటార్ల రూపంలో చూడొచ్చు. వేలాది మెట్ల వరసల్ని పర్వతం వాలున కట్టినట్టుంటాయి ఈ కొటార్లు. రెండు వేల ఏళ్ల నాటి చనాపటా సంస్కృతి ఇక్కడ వర్ధిల్లింది. వారే తొలిసారి క్రీ.శ. 200-900 ఏళ్ల మధ్య ఈ ఉప్పు కొటార్లను ఏర్పాటు చేశారు. వాటి నుంచి ఇప్పటికీ ఉప్పు తయారవుతోంది. చతురస్రాకారంలో ఏర్పాటు చేసిన ఈ కొటార్లకు ఉప్పు నీరు అందేది పర్వతం పైనున్న ఉప్పు నీటి బుగ్గ నుంచే. పైనుంచి నీటిని ఈ ఉప్పు కొటార్లలోకి మళ్లించి అనుకూలంగా ఉండే ఆండీయన్ వాతావరణం వేడిమికి పవనాలకు ఆరబెడతారు. 30 సెం.మీ.ల లోతు మాత్రమే ఉండే కొటార్లలో ఉప్పు పోగవుతుంది. మారస్ గ్రామ ప్రజలు ఓ కమిటీగా ఏర్పడి కొటార్లను నిర్వహిస్తున్నారు.

Check List

Book Number	KNSR02B184	Date	3/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Lakshmi	Cutting By	Lakshmi
Scanned By	pradhya	Pages	29